


# ప్రజాప్రశ్న

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 14, పేజీలు - 08

సోమవారం, జూన్ 16, 2025 వెల: 5 రూ/.

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati




## హీటెక్కిస్తున్న జూబ్లీహిల్స్

# బైపోల్ వార్

**- మాగంటి ఫ్యామిలీ పోటీ చేస్తుందా.?**

**- కాంగ్రెస్, బీజేపీలో టికెట్ రేసు**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో ఓ వెలుగు వెలిగిన బీఆర్ఎస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. తెలంగాణ రాజకీయాల్లో ఇప్పటి వరకూ సిట్టింగ్ ఎమ్మెల్యే మరణిస్తే, తిరిగి ఆ కుటుంబంలోని వ్యక్తులకే ఎమ్మెల్యే సీటు కేటాయించడంతోపాటు, మిగతా పార్టీలు కూడా పోటీకి దూరంగా ఉండేవి. కానీ తాజా రాజకీయాల్లో అటువంటి ఆనవాయితీకి చెక్ పెట్టేశాయి ప్రధానపార్టీలు. ఈ క్రమంలో 6 నెలల్లోపే జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి ఉపఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. సిట్టింగ్ సీటును తిరిగి దక్కించుకునే వ్యూహంతో బీఆర్ఎస్ , ఈసారైనా సత్తా చాటేందుకు అధికార కాంగ్రెస్, తామేం తక్కువ కాదంటూ బిజెపి ఇలా మూడు పార్టీలు టార్గెట్ జూబ్లీహిల్స్ అంటూ ఇప్పటి నుండే ఎమ్మెల్యే అభ్యర్థుల వేటలో బిజీగా ఉన్నాయి.

### కేసీఆర్ ఫ్యామిలీతో మాగంటికి సాన్నిహిత్యం

బిఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న మాగంటి గోపీనాథ్ స్థానంలో తిరిగి బిఆర్ఎస్ అభ్యర్థి మాత్రమే విజయం సాధించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ జూబ్లిహిల్స్ సీటు వదులుకోకూడదనే ఉద్దేశంతో బీఆర్ఎస్ ఉంది. 2014లో టీడీపీ నుండి ఎమ్మెల్యేగా గెలిచిన గోపీనాథ్, ఆ తరువాత బీఆర్ఎస్ లో చేరడం 2018, 2023 ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలవడంతోపాటు, ఇన్నాళ్లు పార్టీకి నమ్మిన బంటులా ఉన్నారు. మాగంటి గోపీనాథ్ కు కేసీఆర్ కుటుంబంతో మంచి సాన్నిహిత్యం ఉంది. ఇటీవల గోపీనాథ్ పార్థీవదేహం వద్ద కేసీఆర్ కంటతడి పెట్టుకున్నారంటే సెంటిమెంట్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

### మాగంటి ఫ్యామిలీ పోటీ చేస్తుందా.?

కష్టకాలంలో పార్టీని నమ్ముకోవడంతోపాటు, అధికార పార్టీ ప్రలోభాలకు లొంగకుండా తన విధేయతను చాటుకున్న మాగంటి గోపీనాథ్ కుటుంబంలో ఆసక్తి ఉన్నవారికే ఎమ్మెల్యే సీటు కేటాయించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఒకవేళ పోటీకి మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులకు ఆసక్తి లేకపోతే, పీజేఆర్ కుమారుడు విష్ణువర్ధన్ రెడ్డి ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. బిఆర్ఎస్ లో మాగంటి కుటుంబమే బరిలోకి దిగుతుందా, లేక పిజేఆర్ వారసత్వం పోటీ ఇస్తుందా అనే ఆసక్తి నెలకొంది.

### కాంగ్రెస్ నుంచి ఎవరు..

జూబ్లీహిల్స్ నియోజకర్గంపై కాంగ్రెస్ లెక్కలు మరోలా ఉన్నాయి. హైదరాబాద్ లో జూబ్లీహిల్స్ కీలకమైన నియోజకవర్గం కావడంతో ఈసారి హస్తం జెండా ఎగురవేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్ పోటీచేశారు. అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి గోపీనాథ్ కు గట్టి పోటీ ఇచ్చారు. జూబ్లీహిల్స్ లో మైనారిటీ ఓట్లు అభ్యర్థుల గెలుపోటములు ప్రభావితం చేస్తాయి. ఈ క్రమంలో ఈసారి బైపోల్ ఎన్నికల్లోనూ అజారుద్దీన్ కు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వాలనే భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉంటే కాంగ్రెస్ లో అజార్ కు పోటీగా గట్టి లాబియింగ్ జరుగుతోంది. జూబ్లీహిల్స్ బరిలో నేనూ ఉన్నానంటూ పీజేఆర్ కూతరు విజయారెడ్డి సైతం ఇప్పటికే నియోజకవర్గం ప్రజలను ఆకట్టుకునేలా ప్రచారం మొదలుపెట్టారు. ఇలా అధికార పార్టీ నుండి ఎమ్మెల్యే టిక్కెట్ ఎవరికి కేటాయిస్తారనే ఉత్కంఠ కొనసాగుతోంది.

### తగ్గేదేలే అంటున్న బీజేపీ

గత అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ పుంజుకుంది. అదే జోరు జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ చూపించాలని కమలం నేతలు భావిస్తున్నారు. 2023 ఎన్నికల్లో బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిగా లంకల దీపక్ రెడ్డి పోటీచేశారు. 25 వేల ఓట్లు సాధించి తామేం తక్కువ కాదంటూ నిరూపించారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బంధువైన దీపక్ రెడ్డి ప్రస్తుతం సికింద్రాబాద్ బీజేపీ డివిజన్ ప్రెసిడెంట్ గా ఎంపికై పార్టీలో యాక్టివ్‌గా ఉన్నారు. జూబ్లీహిల్స్ బైపోల్ లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తిరిగి దీపక్ రెడ్డిని నిలబెట్టే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవేళ నిర్ణయం మారితే మరో ఇద్దరు మహిళా నేతలు బిజెపి నుండి ఎమ్మెల్యే టిక్కెట్ కోసం పోటీపడుతున్నారు. గతంలో బిజెపి సీటు కోసం చివరి వరకూ ప్రయత్నం చేసి కీర్తిరెడ్డి, కిమ్స్ డైరెక్టర్ డాక్టర్ పద్మ కూడా బీజేపీ జూబ్లీహిల్స్ టిక్కెట్ ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా బీజేపీలో త్రిముఖ పోటీ హీటు పుట్టిస్తోంది.

---

## మాజీ సీఎం విజయ్ రూపాణీ

# మృతదేహం గుర్తింపు

**- విజయ్ రూపానీ డీఎన్ఏ మ్యాచ్**



**గాంధీనగర్ (ప్రశ్న న్యూస్)** గుజరాత్ లోని అహ్మదాబాద్ లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిపోయిన ఘటనలో 265 మంది ప్రాణాలు కోల్పోయారు. ఎయిర్ ఇండియా బోయింగ్ 787-8 డ్రీమ్ లైనర్ విమానం అహ్మదాబాద్ ఎయిర్ పోర్ట్ సమీపంలోని బీజే వైద్య కళాశాల భవనంపై పడటంతో మరో 24 మంది వైద్య విద్యార్థులు కూడా ప్రాణాలు కోల్పోయారు. అయితే మృతుల్లో గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపాణీ కూడా ఒకరు. ఎయిర్ ఇండియా విమాన శకలాల నుంచి మృతదేహాలను వెలికి తీసిన అధికారులు డీఎన్ఏ టెస్టు నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్ కు తరలించారు. అయితే ఈ క్రమంలో మాజీ సీఎం విజయ్ రూపాణీ మృతదేహాన్ని గుర్తించారు. డీఎన్ఏ పరీక్షల ద్వారా ఆయన మృతదేహాన్ని అధికారులు గుర్తించారు. దీంతో విజయ్ రూపాణీ అంత్యక్రియలకు ఏర్పాట్లు వేగవంతం అయ్యాయి. జూన్ 15న ఆయన అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

జూన్ 15 ఆదివారం నాటికి 32 మృతదేహాలను గుర్తించారు. వీటిలో 14 మృతదేహాలను కుటుంబ సభ్యులకు అందించారు. అయితే మాజీ సీఎం విజయ్ రూపాణీని మృత్యువు వెంటాడిందని చెప్పవచ్చు. తొలుత ఆయన మే 19 తారీఖునే లండన్ వెళ్లాల్సి ఉంది.

2లో..

---

# మృత్యు విహంగం

**- ఉత్తరాఖండ్‌లో మరో హెలికాప్టర్ ప్రమాదం**

**- కేదార్‌నాథ్ భక్తులతో వెళ్తుండగా మిస్సింగ్**

**- అటవీ ప్రాంతంలో కూలిపోయిన హెలికాప్టర్**



**కేదార్‌నాథ్ (ప్రశ్న న్యూస్)** ఉత్తరాఖండ్‌లో ఆదివారం ఉదయం హెలికాప్టర్ కూలిన ఘటనలో అందులో ఉన్న ఏడుగురూ మృతి చెందినట్టు అధికారులు ధ్రువీకరించారు. కేదార్‌నాథ్ ధామ్ నుంచి గుప్తకాశీకి బయలుదేరిన హెలికాప్టర్ రుద్రప్రయాగ్ జిల్లాలోని గౌరీకుండ్

2లో..

---

# పొగాకు కొనుగోళ్లకు రూ.150 కోట్లు కేటాయించండి

**- హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్లపై కేంద్రమంత్రికి చంద్రబాబు వినతి**

**- పామాయిల్‌పై దిగుమతి సుంకం తగ్గించాలని కోరిక**

**- ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్ జీఎస్టీపైనా చర్చ**

**- రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై వినతి పత్రం**



**అమరావతి / న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఏపీ సీఎం చంద్రబాబుతో కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖామంత్రి పీయూష్ గోయల్ భేటీ ముగిసింది. రాష్ట్రంలోని వివిధ అంశాలపై భేటీలో చంద్రబాబు, పీయూష్ గోయల్ మధ్య చర్చ జరిగింది. టొబాకో బోర్డు ద్వారా ఏపీలో పొగాకు కొనుగోళ్లకు రూ.150 కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి కోరారు. పొగాకు ధరలు తగ్గినా రాష్ట్ర ప్రభుత్వమే రూ.300 కోట్లతో 20 మిలియన్ కేజీలు కొనుగోలు చేస్తున్నట్టు వెల్లడించారు. హెచ్డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు, పామాయిల్ పై దిగుమతి సుంకం తగ్గింపు, ఆక్వా ఎగుమతులు, మ్యాంగో పల్ప్ పై జీఎస్టీ తగ్గింపుపై చర్చించారు.

**- కేంద్ర మంత్రిని చంద్రబాబు ఏం కోరారంటే..**

'బాపట్ల, గుంటూరు, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఏడు చోట్ల పొగాకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. పొగాకు కొనుగోళ్ల నిమిత్తం ఏపీ ప్రభుత్వం ఖర్చు చేసే రూ. 300 కోట్లలో టొబాకో బోర్డు రూ.150 కోట్లు భరించేలా చూడాలి. పొగాకు ఉత్పత్తి, మార్కెటింగ్ వంటి అంశాలను టొబాకో బోర్డు ద్వారా నియంత్రించేలా చట్టసవరణ చేయాలి. ఆయిల్ పాం దిగుమతి సుంకాన్ని 10 శాతానికి తగ్గించడంపై పునరాలోచన చేయాలి. దిగుమతి సుంకం తగ్గించడం వల్ల రాష్ట్రంలోని పామాయిల్ రైతులకు సరైన ధర రావడం లేదు.

2లో..

---

# యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం పెంపు

**- రండి.. మీరు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనండి**

2లో..




---

## తెలంగాణ మహిళలకు

# భారీ శుభవార్త

**- త్వరలోనే వాళ్ళ ఖాతాల్లో డబ్బులు**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల సమీపిస్తున్న వేళ తెలంగాణ రాష్ట్రంలోని మహిళలకు ఆర్థికంగా భరోసా కల్పించడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో భాగంగా మహిళలకు నెలకు 2,500 రూపాయల ఆర్థిక సహాయం అందించే మహాలక్ష్మి పథకాన్ని అందిస్తామని ప్రకటించింది.

**- ఆ పథకం అమలుకు తెలంగాణా సర్కార్ సన్నాహాలు**

ఈ క్రమంలో ఆ పథకాన్ని ప్రారంభించడానికి తెలంగాణ ప్రభుత్వం శరవేగంగా సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ పథకం ద్వారా సంవత్సరానికి మహిళలకు 30 వేల రూపాయల

2లో..

---

## ప్రభుత్వ పాఠశాలల్లో

# డిజిటల్ బోధన

**- ఎన్జీవో సంస్థలతో విద్యాశాఖ ఒప్పందం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో రాష్ట్ర విద్యాశాఖ ప్రముఖ ఎన్జీవో సంస్థలతో ఎంఓయూ కుదుర్చుకుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అత్యాధునిక సాంకేతిక బోధన సేవలను ఉచితంగా అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర విద్యాశాఖ ఆ ఎన్జీవోలతో ఆదివారం నాడు ఒప్పందం చేసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో అధునాతన ఎడ్ టెక్ సదుపాయాలను అందించనుంది ప్రభుత్వం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఆరు ప్రముఖ సంస్థల భాగస్వామ్యంతో ఇది

2లో..

---

## పిలిస్తే బీజేపీలోకి చిరంజీవి

**- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో తమకు ప్రధాన ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీ అని కేంద్ర మంత్రి, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. పుట్టినరోజు సందర్భంగా మీడియాతో ఆదివారం చిట్ చాట్ లో కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను పిలిస్తే టాలీవుడ్ నటుడు చిరంజీవి కచ్చితంగా బిజెపిలో చేరతారని తన మనసులో మాట బయటపెట్టారు. సినీ ఇండస్ట్రీలో పలువురితో బిజెపికి సత్సంబంధాలు ఉన్నాయని, కొందరు

2లో..

---

# 'స్థానిక' ఎన్నికలపై కీలక ప్రకటన

**- జూన్ నెలాఖరులోగా షెడ్యూల్**

**- మంత్రి పొంగులేటి కీలక అప్డేట్**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల హడావుడి మొదలైంది. మంత్రుల వరుస ప్రకటనలతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. క్షేత్రస్థాయిలో రాజకీయ నాయకులు, ఆశావహులలో

2లో..

---

# ఇంద్రాయణి నదిపై కూలిన వంతెన

**- 51 మంది పర్యాటకులు గల్లంతు - 4 మృతదేహాలు వెలికితీత**



**పూణే (ప్రశ్న న్యూస్)** మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. కుండ్‌మాల పర్యాటక ప్రాంతంలో ఇంద్రాయణి నదిపై నిర్మించిన వంతెన ఒక్కసారిగా కుప్పకూలింది. ఈ ప్రమాదంలో నలుగురు పర్యాటకులు మృతి చెందగా, పలువురు నదిలో కొట్టుకుపోయి గల్లంతయ్యారు. సహాయక బృందాలు

2లో..

---

## మరో 8 మంది టాప్ కమాండర్లను

# కోల్పోయిన ఇరాన్

**- టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ భీకర వైమానిక దాడులు**

2లో..



---

## అంటార్కిటికా మంచు పొరల కింద అంతుచిక్కని రేడియో సంకేతాలు

**- సంకేతాల వెనుక కారణం ఇప్పటికీ అంతుచిక్కని మిస్టరీ**

2లో..



## మాజీ సీఎం విజయ్ రూపాణీ

# మృతదేహం గుర్తింపు

కానీ టికెట్ క్యాన్సెల్ అయింది. జూన్ 5 మళ్లీ బుక్ చేసుకోగా అది కూడా క్యాన్సెల్ కావడం గమనార్హం. చివరగా జూన్ 12న టికెట్ బుక్ చేసుకున్నారు. లండన్ లో ఉన్న తన భార్య, కూతురు దగ్గరకు వెళ్లేందుకు టికెట్ బుక్ చేసుకున్నారు విజయ్ రూపాణీ. విజయ్ రూపాణీకు మృదు స్వభావిగా మంచి పేరుంది. ఆయన 2016 ఆగస్టు నుంచి 2021 సెప్టెంబర్ వరకు రెండు సార్లు గుజరాత్ సీఎంగా పనిచేశారు. పాలనలో తనదైన ముద్ర వేశారు విజయ్ రూపాణీ. ఆయన మృతితో రాష్ట్రంలోని బీజేపీ శ్రేణులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. ప్రముఖులు, వీఐపీలు" విజయ్ రూపాణీ మృతితో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన లక్కీ నంబర్ 1206 అట. విజయ్ రూపాణీ కారు నంబర్, బైక్ నంబర్ కూడా ఇదే కావడం గమనార్హం. ఇప్పుడు 12 జూన్ అంటే 12-06 తేదీనే ఆయన అనంత లోకాలకు వెళ్లిపోవడం అందరినీ షాక్ కు గురిచేస్తోంది. లక్కీ నంబర్ తేదీ రోజే విజయ్ రూపాణీ మృతి చెందడం బీజేపీ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. అయితే అహ్మదాబాద్ లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన ఘటనలో భారత్ కు చెందిన 169 మంది ప్రయాణికులు మృతి చెందగా బ్రిటన్ కు చెందిన 53 మంది పోర్చుగీసుకు చెందిన ఏడుగురు, కెనడాకు చెందిన ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఇక 625 అడుగుల ఎత్తులోంచి ఒక్కసారిగా విమానం కుప్ప కూలిపోవడంతో 265 మంది అగ్నికి ఆహుతి అయ్యారు. అయితే ఇంతటి ఘోర విమాన ప్రమాదంలో ఒకే ఒక్కడు మాత్రమే బతికి బయట పడ్డాడు. అతడే 40 ఏళ్ల బ్రిటిష్ ఇండియన్ విశ్వాస్ కుమార్ రమేశ్. అతడు 11ఏ సీటులో కూర్చొన్నాడు. విమానం కుప్పకూలిన ఘటనలో అందరూ చనిపోగా అతడు మాత్రం స్వల్ప గాయాలతోనే బయటపడ్డాడు.

# మృత్యు విహంగం

ప్రాంతంలో కూలిపోయింది. ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న పైలట్‌తో సహా ఆరుగురు యాత్రికులు అక్కడికక్కడే మృతి చెందారు. మృతులలో 23 నెలల చిన్నారి కూడా ఉండటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఉదయం సుమారు 5:20 గంటలకు ఈ ప్రమాదం సంభవించింది. కేవలం 10 నిమిషాల ప్రయాణ దూరంలో ఉండగా గౌరీకుండ్, సోన్‌ప్రయాగ్ మధ్య గౌరీమాయ్ ఖార్క్ సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో హెలికాప్టర్ కుప్పకూలింది. ప్రతికూల వాతావరణం, సరిగా దారి కనపడకపోవడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణాలని అధికారులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఉత్తరాఖండ్ పౌర విమానయాన అభివృద్ధి సంస్థ (యుకాడా) విడుదల చేసిన ప్రకటన ప్రకారం మరణించిన యాత్రికులలో ఐదుగురు పెద్దలు, ఒక చిన్నారి ఉన్నారు. వీరు ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు చెందినవారని తెలిసింది. పైలట్ కూడా ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) బృందాలు సహాయక చర్యల కోసం ఘటనా స్థలానికి బయలుదేరాయి. ప్రమాదం జరిగిన గౌరీ మాయ్ ఖార్క్ ఎగువన ఉన్న అటవీ ప్రాంతం చాలా దట్టంగా ఉండటం, అక్కడికి చేరుకోవడానికి సరైన మార్గం లేకపోవడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కష్టతరమైన భూభాగంలో ప్రయాణిస్తూ ప్రమాద స్థలానికి చేరుకునే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ దుర్ఘటనపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "రుద్రప్రయాగ్ జిల్లాలో హెలికాప్టర్ కూలిన వార్త నన్ను తీవ్రంగా కలచివేసింది. ఎస్డీఆర్ఎఫ్, స్థానిక యంత్రాంగం, ఇతర సహాయక బృందాలు సహాయక చర్యలలో నిమగ్నమై ఉన్నాయి" అని ఆయన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. మే 2న కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరిచినప్పటి నుండి ఇది ఐదో విమానయాన సంబంధిత సంఘటన కావడం గమనార్హం. జూన్ 7న కూడా ఒక హెలికాప్టర్ టేకాఫ్ సమయంలో సాంకేతిక లోపంతో రుద్రప్రయాగ్-గౌరీకుండ్ రహదారిపై అత్యవసరంగా ల్యాండ్ అయింది. ఆ సమయంలో హెలికాప్టర్ తోక భాగం పార్క్ చేసి ఉన్న కారును ఢీకొనగా, సమీపంలోని భవనాలకు అత్యంత దగ్గరగా వచ్చింది. అదృష్టవశాత్తూ ఆ ఘటనలో ఐదుగురు యాత్రికులు సురక్షితంగా బయటపడగా, పైలట్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

## పొగాకు కొనుగోళ్లకు

# రూ.150 కోట్లు కేటాయించండి

తీవ్రంగా నష్టపోతారు. దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయం కేంద్రం నిర్దేశించిన నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ లక్ష్యాలకు కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. ఆక్వా ఎగుమతులపై అమెరికా విధించిన సుంకాల విషయంలో ఆ దేశంతో చర్చలు జరపాలని' కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను చంద్రబాబు కోరారు.

### - ట్రంప్ సుంకాలతో ఆక్వా రైతులపై ప్రభావం

సీఫుడ్ పై అమెరికా విధించిన 27 శాతం సుంకాలు ఏపీలోని 8 లక్షల మంది ఆక్వా రైతులపై ప్రభావం చూపుతాయని సీఎం చంద్రబాబు తెలిపారు. ఏపీ ఆక్వా రైతులపై ఈ భారాన్ని తగ్గించేలా చొరవ తీసుకోవాలని వినతి. మ్యాంగో పల్ప్ పై జీఎస్టీని 12 నుంచి 5 శాతానికి తగ్గించాలని పీయూష్ గోయల్ ని కోరారు. ఈ విషయాన్ని ఇదివరకే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లామని పీయూష్ గోయల్ కు సీఎం చంద్రబాబు వివరించారు. గుంటూరు పొగాకు బోర్డు కేంద్ర కార్యాలయంలో నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్మెంట్ సంస్థ పై అధికారులతో సమీక్ష జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తో పాటు సీఎం చంద్రబాబు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే గల్లా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్ర పాల్గొన్నారు.

## యోగాతో మానసిక,

# శారీరక ఆరోగ్యం పెంపు

అమరావతి (ప్రశ్న న్యూస్) విశాఖలో ఈ నెల 21న 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో 5 లక్షల మందితో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు ఏపీలోని కూటమి ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో, యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనాలంటూ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు సోషల్ మీడియాలో స్పందించారు. "ప్రపంచానికి భారత దేశం ప్రసాదించిన దివ్య వరం.. యోగ. ఆరోగ్యాన్నే కాకుండా ఆయుష్షును పెంచే యోగ మన జీవన విధానం కావాలి. ఈ నెల 21న విశాఖపట్నంలో 11వ ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ గారు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. రండి మీరు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనండి. యోగాను జీవితంలో భాగం చేసుకుందాం, ఆరోగ్యంగా జీవిద్దాం" అని చంద్రబాబు పేర్కొన్నారు. "ప్రజల మానసిక, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతో అవసరం. ప్రపంచానికి భారత్ అందిస్తున్న గొప్ప వరం యోగా. ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతగానో తోడ్పడుతుంది. ఈ నెల 21వ తేదీన విశాఖపట్నంలో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచ యోగా దినోత్సవంలో మన భారత ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొంటున్నారు. రికార్డు స్థాయిలో నిర్వహించే ఈ వేడుకను విజయవంతం చేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరుతున్నాను. యోగా వ్యాయామం మాత్రమే కాదు మన జీవన విధానం అని చాటిచెప్పండి" అని నారా లోకేశ్ వివరించారు.

# ఇంద్రాయణి నదిపై కూలిన వంతెన

తక్షణమే రంగంలోకి దిగి 51 మందిని సురక్షితంగా కాపాడాయి. గల్లంతైన వారికోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు యుద్ధప్రాతిపదికన గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ప్రమాద సమయంలో వంతెనపై అధిక సంఖ్యలో పర్యాటకులు ఉన్నట్లు సమాచారం.

మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని, గాయపడిన వారి చికిత్స ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. వంతెన శిథిలావస్థకు చేరడం, సామర్థ్యానికి మించి జనం ఉండటమే ప్రమాదానికి కారణమని ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు. ఇదే ప్రాంతంలో రూ.8 కోట్లతో కొత్త వంతెన నిర్మాణానికి ఇప్పటికే ఆమోదం లభించిందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని నదీ వంతెనల నిర్మాణ నాణ్యతపై తనిఖీలు (స్ట్రక్చరల్ ఆడిట్) నిర్వహించాలని మరో ఉపముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ఆదేశించారు. ఈ దుర్ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. సహాయక చర్యల గురించి సీఎం ఫడ్నవీస్‌ను అడిగి తెలుసుకున్నారు.

# తెలంగాణ మహిళలకు భారీ శుభవార్త

ఆర్థిక భరోసా అందనుంది. ఈ పథకం ద్వారా 55 సంవత్సరాలలోపు వయసున్న తెల్ల రేషన్ కార్డు కలిగిన మరియు పెన్షన్ సౌకర్యం లేని మహిళలకు నెలకు 2500 రూపాయల ఆర్థిక సహాయం అందించడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.

### - మహాలక్ష్మీ పథకంపై వేగంగా కసరత్తు

మహాలక్ష్మి పథకంలో భాగంగా అందించే ఈ ఆర్థిక సహాయాన్ని త్వరితగతిన ఇవ్వాలని ప్రయత్నిస్తోంది. ఈ పథకానికి సంబంధించిన విధివిధానాలను వేగంగా రూపొందిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే దీనిని ఇవ్వగలిగితే ప్రజల మద్దతు పూర్తిస్థాయిలో పొందే అవకాశం ఉంటుందని భావిస్తోంది. ఇప్పటికే అనేకమార్లు తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి త్వరలోనే తెలంగాణ మహిళలకు శుభవార్త చెబుతారని పేర్కొన్నారు.

### - ఎన్నికల ముందు మహిళల ఖాతాలో డబ్బులు

జూలై నెలలో సర్పంచ్ ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, త్వరలో క్యాబినెట్ భేటీ నిర్వహించి ఎన్నికల తేదీని ప్రకటిస్తారని చెబుతున్న క్రమంలో ఎన్నికలకు ముందు మహిళల ఖాతాలో డబ్బులు జమ చేయడం ద్వారా ప్రజా మద్దతును కూడగట్టుకోవాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇప్పటికే రైతు భరోసా నిధుల ద్వారా రైతాంగం మద్దతును కూడగట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది.

### - మహిళలకు గుడ్ న్యూస్ చెప్పడానికి రెడీ అవుతున్న ప్రభుత్వం

ఇదే సమయంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల ఖాతాలో ఇచ్చిన మాట ప్రకారం 2500 రూపాయల నగదును జమచేసి ఆర్థిక భరోసా కల్పించి రెండు ముఖ్యమైన పథకాలను అమలు చేయడం ద్వారా ప్రజలలో విశ్వాసం పెంచుకోవాలని భావిస్తుంది. ఎన్నికల హామీలను నెరవేర్చడం ద్వారా స్థానిక సంస్థల ఎన్నికలలో పట్టు సాధించాలని, తద్వారా రాష్ట్రంలో మళ్లీ బలంగా గ్రామీణ స్థాయిలో పాగా వేయాలని భావిస్తోంది. ఈ క్రమంలోనే మహిళలకు గుడ్ న్యూస్ చెప్పడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది.

# ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన

ఇందుకు నందన్ నీలేకణి నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్, అలక్ పాండే అధ్వర్యంలోని ఫిజిక్స్ వాలా, డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్, సఫీనా హుస్సేన్ అధ్వర్యంలోని ఎడ్యుకేట్ గర్ల్స్, ఖాన్ అకాడమీ, షోయబ్దార్ నిర్వహిస్తున్న పైజామ్ పౌండేషన్ లాంటి పేరొందిన సంస్థలతో రాష్ట్ర విద్యాశాఖ ఎంఓయూ కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పేరొందిన సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్ర విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో విద్యా నాణ్యత ప్రమాణాలను మెరుగుపరచాలన్న సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు, పథకాలకు ఆకర్షితులై తెలంగాణ ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు వివిధ సంస్థలు ముందుకు వస్తున్నాయి.

### - తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్

నందన్ నీలేకణి నేతృత్వంలోని ఎక్‌స్టెప్ ఫౌండేషన్ కృత్రిమ మేథ (ఏఐ) ఆధారిత ప్లాట్ ఫారమ్‌తో 540 పాఠశాలలలో పని చేస్తుంది. ఇకపై 33 జిల్లాల పరిధిలో 5,000కి పైగా ప్రాథమిక పాఠశాలలకు విస్తరించనుంది. 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకు తెలుగు, ఇంగ్లిష్ భాషలతో పాటు మ్యాథ్స్ బేసిక్స్ను ఈ సంస్థ అందిస్తుంది. ఫిజిక్స్ వాలా ఇంటర్ విద్యార్థులకు నీట్, జేఈఈ, క్లాట్ పరీక్షలకు సన్నద్ధులను చేస్తుంది. పాఠశాల స్థాయి నుంచే పోటీ పరీక్షల దృక్కోణంలో విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తుంది.

### - బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు

డాక్టర్ సునీతా కృష్ణన్ నేతృత్వంలోని ప్రజ్వల ఫౌండేషన్ 6వ తరగతి నుంచి క్లాస్ 12 వరకు విద్యార్థులకు బాల సురక్ష, రక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తుంది. ఖాన్ అకాడమీ 6వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలకు అనుగుణంగా వీడియో ఆధారిత స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మ్యాథ్స్) శిక్షణను అందజేస్తుంది. పై జామ్ ఫౌండేషన్ ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులకు కోడింగ్ మరియు కంప్యూటేషనల్ థింకింగ్ పై శిక్షణను అందిస్తుంది. ఎడ్యుకేట్ గర్ల్స్ సంస్థ రాష్ట్రంలో పాఠశాలలకు దూరంగా ఉన్న 16 వేలకు పైగా పిల్లలను తిరిగి బడిలో చేర్పించటంతో పాటు, బాలికల అక్షరాస్యత మరియు విద్యా అవకాశాలను మెరుగుపరుస్తుంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు, సిఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా, డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నవీన్ నికోలస్, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నర్సింహారెడ్డి, ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ స్పెషల్ సెక్రటరీ హరిత, ప్రజ్వల ఫౌండేషన్ చీఫ్ డా.సునీతా కృష్ణన్, ఎక్‌స్టెప్ ఫౌండేషన్ సీఈవో జగదీష్ బాబు, ఫిజిక్స్ వాలా కో-ఫౌండర్ ప్రతీక్ మహేశ్వరి, పైజామ్ పౌండేషన్ ఫౌండర్ షోయబ్ దార్, ఖాన్ అకాడమీ ఇండియా ఎండీ స్వాతి వాసుదేవన్, ఎడ్యుకేట్ గర్ల్స్ సిఈవో గాయత్రి నాయిర్ లోబో, తదితరులు పాల్గొన్నారు.

# పిలిస్తే బీజేపీలోకి చిరంజీవి

పార్టీలో చేరి విమర్శలు చేసి వెళ్లిపోయారని చెప్పారు.

### - ఒంటరిగానే బరిలోకి బీజేపీ

బిజెపి, కాంగ్రెస్ ఒకటేనని ఎవడో పనికిమాలిన వాడు చేసిన వ్యాఖ్యలకు నేను సమాధానం చెప్పాలా అంటూ కిషన్ రెడ్డి మండిపడ్డారు. కుటుంబ పాలన, అవినీతి రాజకీయాలకు బిజెపి ఎప్పుడు వ్యతిరేకమేనని స్పష్టం చేశారు. త్వరలో తెలంగాణలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేస్తాం అన్నారు. కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఇస్తున్న నిధులను ప్రజలకు వివరించి ఓట్లు అడుగుతామన్నారు.

### - ఈటలకు ఆ నిబంధన వర్తించదు

టిఆర్ఎస్ లో తర్వాత అధ్యక్షుడు ఎవరో అందరికీ తెలుసు. ఆ పార్టీలో డైనింగ్ టేబుల్ మీద నిర్ణయాలు జరుగుతాయి. బిజెపిలో అలాంటి పరిస్థితి ఎన్నటికీ ఉండదు. బిజెపిలో బీసీలకు ప్రాధాన్యం కల్పించాము. 50 శాతం బిజెపి మండల అధ్యక్షులుగా బీసీలు ఉన్నారు. స్థానిక ఎన్నికలు పూర్తయ్యాక మరోసారి ప్రజల్లోకి వెళతాం. బిజెపి రాష్ట్ర అధ్యక్ష పదవి చేపట్టాలంటే రెండుసార్లు క్రియాశీల సభ్యుడు అయి ఉండాలి. కానీ ఎమ్మెల్యే, ఎంపీగా గెలిచిన ఈటెల రాజేందర్ కు ఆ నిబంధన వర్తించదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

### - తెలంగాణకు బీజేపీ ఏం చేసిందంటే..

రాష్ట్ర ఆదాయం దృష్టిలో ఉంచుకొని పథకాలు అమలు చేయాలని, ఉచితలకు బిజెపి ఎప్పుడు వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తెలంగాణలో పసుపు బోర్డు, జహీరాబాద్ లో ఇండస్ట్రియల్ పార్క్, వరంగల్ కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ తెచ్చింది తామే అన్నారు. ఏపీ రాజధాని అమరావతికి సైతం విభజన చట్టంలో పేర్కొన్న ప్రకారం కేంద్రం నిధులు అందించి సహకరిస్తుందన్నారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ జాతీయ నేతగా ఎదగాలని చూస్తున్నారు. కానీ తెలంగాణలో ఏ పార్టీ అధికారంలో ఉంటే వారితో కలిసి పనిచేసే పార్టీ ఎంఐఎం అని ఎద్దేవా చేశారు కిషన్ రెడ్డి. అసదుద్దీన్ తీరు నచ్చక ముస్లిం నేతలు ఆయనను పిట్టలదొర అని అంటారని తెలిపారు. తమ వల్లే రాష్ట్రం వచ్చిందని కాంగ్రెస్ చెబితే ఈడ్చి తన్నాలి. తెలంగాణ కోసం ఎంతో చేసిన పార్టీ తమదేనని, కేంద్రం నిధులు ఇచ్చి సహకరిస్తుందని తెలిపారు. చిరంజీవి సోదరుడు, పవన్ కళ్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎంగా సేవలు అందిస్తున్నారు. జనసేన అధినేత ప్రధాని మోదీకి అత్యంత ఆప్తుడిగా మారిపోయారు. దక్షిణాది బీజేపీ రాజకీయాలకు వీలుచిక్కినప్పుడల్లా తన వంతు సహకారం అందిస్తున్నారు. కిషన్ రెడ్డి అన్నట్లుగా నిజంగానే చిరంజీవి బీజేపీలో చేరతారా అనే చర్చ మొదలైంది. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి లక్ పరీక్షించుకున్నారు. అది బెడిసి కొట్టడంతో తన పార్టీని కాంగ్రెస్ లో విలీనం చేశారు. రాజ్యసభకు పంపించడంతో పాటు కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ బాధ్యతలు అప్పగించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రాజకీయాల నుంచి వైదొలిగిన చిరంజీవి మళ్లీ అటువైపు రానని గతంలోనే స్పష్టం చేశారు. సినిమాలే తనకు జీవితమన్నారు.

# విద్యారంగానికి విద్యార్థులే వారధులు

కాచిగూడ : విద్యార్థులలో దాగి ఉన్న నైపుణ్యతనే ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి దోహదపడుతుందని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. భావసార్ క్షత్రియ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 49వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని 7 నుంచి 10 పదవ తరగతిలో మెరిట్ మార్కులు సాధించిన 400 మంది పేద విద్యార్థులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ నోట్ బుక్స్, బ్యాగులతోపాటు స్టేషనరీని భావాస్కర్ భవన్ కమ్యూనిటీ హాల్‌లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాలేరు హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యారంగానికి కీలకమైన వారధులని ఆయన పేర్కొన్నారు. విద్యకు మద్దతు ఇచ్చే సంస్థలు సమాజాభివృద్ధికి మూల స్తంభాలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా ఇతర రంగాలపై దృష్టి సారించి ముందడుగు వేసినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమేష్ జిటానే, అమర్ నాథ్, అశ్విన్ పటాంగే, కృష్ణ తండ్లే, మధుసూదన్, సత్యనారాయణ, రాజేశ్వర్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

# 'స్థానిక' ఎన్నికలపై కీలక ప్రకటన

కొత్త ఉత్సాహాన్ని నింపాయి. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు, ప్రతిపక్ష పార్టీలు కూడా ఎన్నికల సన్నాహాల్లో నిమగ్నమయ్యాయి. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూలుపై తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక అప్డేట్ ఇచ్చారు. జూన్ నెలాఖరులో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని చెప్పారు. రేపు జరగబోయే కేబినెట్ భేటీలో చర్చించి ఎన్నికల తేదీపై స్పష్టత ఇస్తామని ప్రకటించారు. ముందుగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు జరుగుతాయాని ఆ తర్వాత సర్పంచ్ (గ్రామ పంచాయతీ), మున్సిపల్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికే గ్రామాల్లో, పంచాయతీల్లో వార్డుల విభజన, ఓటరు జాబితా తయారీ పనులను పూర్తి చేసిందన్నారు. ఎంపీటీసీల విభజన, ఓటరు జాబితాను కూడా సిద్ధం చేసి ఎన్నికలకు సన్నద్ధమవుతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి స్థానిక సంస్థల ఎన్నికలు ఇవి. గత ఏడాదే ఎన్నికలు నిర్వహించాలనుకున్నా వాయిదా పడుతూ వస్తున్నాయి. ఈ ఎన్నికలను ఇప్పుడు నిర్వహించడం ద్వారా క్షేత్రస్థాయిలో తమ పట్టును బలోపేతం చేసుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇటీవల అమలు చేసిన రైతు భరోసా, మహాలక్ష్మి వంటి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి లబ్ధి పొందాలని చూస్తోంది. మరోవైపు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ కూడా ఈ ఎన్నికలను తమ బలాన్ని తిరిగి నిరూపించుకునే అవకాశంగా చూస్తోంది. గ్రామస్థాయిలో తమ కార్యకర్తలను, నాయకులను క్రియాశీలం చేసేందుకు ఈ ఎన్నికలను వినియోగించుకోవాలని యోచిస్తోంది. బీజేపీ కూడా లోక్‌సభ ఎన్నికల విజయం తర్వాత స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించి రాష్ట్రంలో తమ ఉనికిని మరింత పటిష్టం చేసుకోవాలని చూస్తోంది. మంత్రుల ప్రకటనల నేపథ్యంలో త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే అవకాశం ఉంది. దీంతో రాష్ట్రంలో రాజకీయ వేడి మరింత రాజుకోనుంది. అన్ని పార్టీలు తమ అభ్యర్థుల ఎంపిక, ప్రచార వ్యూహాలపై దృష్టి సారించనున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు పోటీకి సిద్ధమవుతున్నారు. గ్రామాల్లో పాగా వేసి ఓటరు దేవుళ్లను తమవైపు తిప్పుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు.

## మరో 8 మంది టాప్ కమాండర్లను

# కోల్పోయిన ఇరాన్

న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇజ్రాయెల్ టెహ్రాన్‌తో పాటు ఇతర ఇరాన్ నగరాలపై భీకర దాడులు కొనసాగిస్తోంది. తాజాగా ఈ దాడుల్లో తమ ఏరోస్పేస్ విభాగానికి చెందిన 8 మంది సీనియర్ కమాండర్లు మరణించినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ధృవీకరించింది. ఐఆర్‌జీసీ అధికారిక వార్తా సంస్థ సెపా న్యూస్ ఈ విషయాన్ని వెల్లడిస్తూ, వారి 'అమరత్వం' పట్ల సంతాపం ప్రకటించింది. అంతకుముందు దాడుల్లో ఇరాన్ సాయుధ దళాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ మహ్మద్ బఘేరి, ఐఆర్‌జీసీ చీఫ్ కమాండర్ హొస్సేన్ సలామీ సహా పలువురు ఉన్నత కమాండర్లు మరణించినట్లు వార్తలు వచ్చాయి.

### - ప్రతీకార దాడులు: ఇజ్రాయెల్‌లో ప్రాణ నష్టం

ఈ దాడులకు ప్రతిగా ఇరాన్, ఇజ్రాయెల్‌లోని లక్ష్యాలపై పలు దఫాలుగా క్షిపణి దాడులు చేసింది. ఈ దాడుల వల్ల ఇజ్రాయెల్‌లో ప్రాణనష్టంతో పాటు భారీ ఆస్తి నష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఉత్తర ఇజ్రాయెల్‌లో ఒక నివాస భవనంపై రాకెట్ దాడి జరగడంతో ఒక మహిళ మరణించగా, మరో 13 మంది గాయపడ్డారని ఇజ్రాయెల్ జాతీయ అత్యవసర వైద్య సేవ సంస్థ మాగెన్ డేవిడ్ అడోమ్ (ఎండీఏ) తెలిపింది. ఇరాన్ దాడులు ప్రారంభమైనప్పటి నుంచి కనీసం ముగ్గురు మరణించగా, 204 మంది గాయపడ్డారని ఎండీఏ అంతకుముందు వెల్లడించింది.

### - దాడుల కొనసాగింపు: పశ్చిమాసియాలో ఉద్రిక్తత

తమ వాయు రక్షణ వ్యవస్థలు దూసుకొస్తున్న క్షిపణులు, రాకెట్లను సమర్థంగా అడ్డుకుంటున్నాయని, అదే సమయంలో ఇజ్రాయెల్ వైమానిక దళ విభాగాలు టెహ్రాన్‌లోని సైనిక లక్ష్యాలపై దాడులు నిర్వహిస్తున్నాయని ఇజ్రాయెల్ సైన్యం తెలిపింది. హైఫా మరియు ఉత్తర ప్రాంతాల వెలుపల నివసించే ప్రజలు బాంబు షెల్టర్ల నుండి బయటకు రావొచ్చని, అయితే సురక్షిత ప్రాంతాలకు సమీపంలోనే ఉండాలని ఇజ్రాయెల్ హోమ్ ఫ్రంట్ కమాండ్ సూచించింది. ఈ పరిణామాలతో పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు మరింత దట్టంగా కమ్ముకున్నాయి, తీవ్ర ఆందోళన నెలకొంది.

## అంటార్కిటికా మంచు పొరల కింద

# అంతుచిక్కని రేడియో సంకేతాలు

**అంటార్కిటికా (ప్రశ్న న్యూస్)** అంటార్కిటికాలోని అనంతమైన మంచు పొరల కింద నుంచి వెలువడుతున్న వింత రేడియో తరంగాలు శాస్త్ర ప్రపంచంలో కలకలం రేపుతున్నాయి. అధిక శక్తి కలిగిన కణాలను గుర్తించేందుకు చేపట్టిన 'అంటార్కిటిక్ ఇంపల్సివ్ ట్రాన్సియెంట్ యాంటెన్నా' (అనిటా) ప్రయోగంలో ఈ అసాధారణ సంకేతాలు వెలుగుచూశాయి. నాసా సహకారంతో సాగుతున్న ఈ ప్రయోగం అసలు లక్ష్యం అంతరిక్షం నుంచి భూమిపైకి దూసుకొచ్చే అత్యంత శక్తివంతమైన కణాలను అధ్యయనం చేయడం. అయితే, ఊహించని విధంగా భూగర్భం నుంచి ఈ రేడియో తరంగాలు వెలువడుతుండటం శాస్త్రవేత్తలను ఆశ్చర్యానికి గురిచేసింది.

### - అనూహ్యంగా వెలుగులోకి వచ్చిన తరంగాలు

అధిక శక్తి కలిగిన న్యూట్రినోల వంటి కణాల కోసం అన్వేషిస్తున్న సమయంలో ఈ వింత సంకేతాలు రికార్డయ్యాయి. స్ట్రాటోస్ఫియర్‌లోకి పంపిన భారీ బెలూన్‌కు అమర్చిన రేడియో పరికరాలు వీటిని గుర్తించాయి. సాధారణంగా ఇలాంటి తరంగాలు అంతరిక్షం నుంచి వస్తాయని భావిస్తారు. కానీ, ఇవి మంచు పొరల కింద నుంచి, సుమారు 30 డిగ్రీల దిగువ కోణంలో వస్తున్నట్లు తేలడం పరిశోధకులను విస్మయపరిచింది. వేలాది కిలోమీటర్ల మంచు, రాతి పొరలను దాటుకుని వస్తున్న ఈ తరంగాలు తమ శక్తిని కోల్పోకుండా ఉండటం అసాధారణం.

### - న్యూట్రినోలు కాదని నిర్ధారణ

మొదట ఈ సంకేతాలు న్యూట్రినోల వల్ల ఏర్పడి ఉండవచ్చని భావించినప్పటికీ, లోతైన విశ్లేషణ అనంతరం ఆ భావనను శాస్త్రవేత్తలు తోసిపుచ్చారు. పెన్ స్టేట్ యూనివర్సిటీకి చెందిన అనిటా బృంద సభ్యురాలు, ఖగోళ భౌతిక శాస్త్రవేత్త స్టెఫానీ విస్సెల్ మాట్లాడుతూ, ఈ తరంగాల కోణాలు, స్వభావం న్యూట్రినోల లక్షణాలతో సరిపోలడం లేదని స్పష్టం చేశారు. ఇతర ప్రయోగాల డేటాతో పోల్చి చూసినప్పటికీ, ఇవి న్యూట్రినో ఘటనలు కావని నిర్ధారించుకున్నట్లు తెలిపారు.

### - వీడని మిస్టరీ.. కొనసాగుతున్న పరిశోధనలు

ఈ రేడియో సంకేతాల వెనుక ఉన్న అసలు కారణం ఇప్పటికీ అంతుచిక్కడం లేదు. ఇవి డార్క్ మ్యాటర్‌కు సంబంధించినవా, లేక మంచు పొరల కింద ఏదైనా తెలియని భౌతిక ప్రక్రియ జరుగుతోందా అనే కోణంలో శాస్త్రవేత్తలు అన్వేషిస్తున్నారు. ఈ రహస్యాన్ని ఛేదించేందుకు మరిన్ని ప్రయోగాలు, డేటా అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతానికి, అంటార్కిటికా మంచు కింద దాగి ఉన్న ఈ మిస్టరీ సిగ్నల్స్ శాస్త్రవేత్తలకు ఓ సవాల్‌గా మారాయి, మరిన్ని పరిశోధనలకు ఆస్కారం కల్పిస్తున్నాయి.

## రేణుశ్రీది ఆత్మహత్య కాదు, హత్య

# మహిళా సంఘాలు

కమలాపూర్ : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన దార్ల రేణుశ్రీ ది ఆత్మహత్య కాదని హత్య చేసి నేటి సంపులో వేశారని మహిళా సంఘాల నాయకులు ఆరోపించారు. ఆదివారం రేణు శ్రీ స్వగ్రామం గూడూరులో మహిళా సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మహిళా సంఘాల నాయకులు మాట్లాడుతూ రేణు శ్రీకి పిల్లలు పుట్టడం లేదని వేధింపులకు గురి చేస్తున్నట్లు చెప్పారు. భర్త ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండి పిల్లలు పుట్టడం లేదని అనడం సిగ్గుచేటు అన్నారు. పిల్లలు పుట్టకపోవడం భార్య లోపం మాత్రమే కాదని భర్త లోపం ఉంటుందన్నారు. పిల్లల కోసం డాక్టర్ను సంప్రదించకుండా శారీరకంగా, మానసికంగా రేణుశ్రీని వేధించారన్నారు. భర్త, అత్తమామలే రేణు శ్రీని హత్య చేసి నీటి సంపులో పడేసినట్లు ఆరోపించారు. మృతి చెంది మూడు రోజులైనా భర్త, అత్తమామలను అరెస్టు చేయలేదని విమర్శించారు. పోలీసులు వెంటనే అరెస్టు చేయకపోతే మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ఫిష్ ఆయిల్ తీసుకుంటే ఇన్ని లాభాలా..?



మంచి ఆరోగ్యం కోసం మంచి పోషకాహారం చాలా ముఖ్యం. ఆహారంతో పాటుగా శరీరానికి కొన్ని రకాల నూనెలు, కొవ్వులు కూడా తప్పనిసరిగా అవసరం. మంచి కొవ్వులు అనేవి శరీర కండరాలకి అవసరం. వాటిలో ఒకటే చేప నూనె. ఆహారంలో చేపల్ని తరచూ తినడం వల్ల మన శరీరానికి కావాల్సిన చేప నూనె సమృద్ధిగా అందుతుంది. లేదంటే.. చేప నూనె సప్లిమెంట్స్‌ని తీసుకోవడం వల్ల కూడా అందుతుంది. ఫిష్ ఆయిల్ అనేది చేపల నుంచి తీసిన ఒక రకమైన నూనె. ఫిష్ ఆయిల్‌లోని గుణాలు హార్ట్ హెల్త్, బ్రెయిన్ హెల్త్, ఇతర హెల్త్ బెనిఫిట్స్ అనేకం ఉన్నాయి. ఫిష్ ఆయిల్ బెస్ట్ యాంటీ ఆక్సిడెంట్‌గా కూడా పనిచేస్తుంది. ఇది అనేక చర్మ వ్యాధులు, ఇన్ఫెక్షన్స్ నుండి రక్షించడంలో సాయపడుతుంది. ఒక గ్రాము ఫిష్ ఆయిల్‌లో సుమారు 300 నుంచి 500 మిల్లీగ్రాముల ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ లభిస్తాయి. ఇవి ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గిస్తాయి. చేపనూనెలో ఎక్కువగా ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ అనే యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్. దీంతో అనేక ఆరోగ్య సమస్యల నుంచి దూరంగా ఉండొచ్చు. ఇది చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. పలు అధ్యయనాల ప్రకారం.. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ తీసుకుంటే మీ గుండె ఆరోగ్యం, బ్రెయిన్ హెల్త్‌తో పాటు చాలా హెల్త్ బెనిఫిట్స్ ఉన్నాయి. ఫిష్ ఆయిల్‌తో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది

. చేపనూనెలో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, ఐకోసాపెంటోనోయిక్ ఆమ్లం, డోకోసాహెక్సేనోయిక్ ఆమ్లం. ఇది ట్రైగ్లిజరైడ్స్ స్థాయిని తగ్గించడంలో మెడిసిన్‌లా పనిచేస్తుంది. ఇది గుండె జబ్బులా ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. ఫిష్ ఆయిల్‌తో గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఫిష్ ఆయిల్ క్యాప్సుల్‌లో 400 నుంచి1000 ఐయూ పరిమాణంలో విటమిన్ డి లభిస్తుంది. ఎముకలను బలంగా మార్చడంలో ఇది సహాయపడుతుంది. విటమిన్ డి కాల్షియం శోషణను కూడా మెరుగుపరుస్తుంది. ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ తీసుకుంటే శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. ముఖ్యంగా, ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు ఐకోసపెంటెనోయిక్ ఆమ్లం, డోకోసాహెక్సేనోయిక్ ఆమ్లం చాలా లాభాలున్నాయి. ఫిష్ ఆయిల్‌లో విటమిన్ ఎ లభిస్తుంది. ఇది కంటిని ఆరోగ్యంగా మార్చుతుంది.

# ఈ అరుదైన పండు పవర్ తెలిస్తే..



సీమ చింతకాయ.. గ్రామీణ నేపథ్యం కలిగిన ప్రతి ఒక్కరికీ ఈ పండు గురించి తెలిసే ఉంటుంది. గతంలో గ్రామాల్లు, పల్లెల్లో ఈ సీమ చింతచెట్లు ఎక్కువగా కనిపించేవి.. కానీ, ప్రస్తుతం పట్టణీకరణ కారణంగా పల్లెలు కూడా కాంక్రీట్ జంగిల్‌లుగా మారిపోతున్నాయి. దీంతో ఇలాంటి చెట్లు నేటి తరానికి పరిచయం కూడా లేకుండా పోతున్నాయి. అయితే, సాధారణ చింతకాయతో పోలిస్తే.. సీమ చింతకాయ రుచిలో కాస్త వగరు, తీపి కలగలిసిన విలక్షణమైన రుచిని కలిగి ఉంటాయి. కానీ ఈ అరుదైన పండు కేవలం రుచిలోనే కాదు, ఆరోగ్య ప్రయోజనాల విషయంలోనూ అద్భుతమైన నిధి లాంటిది అంటున్నారు ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు. ఈ చిన్నసైజు సీమ చింతకాయతో అద్భుతమైన ప్రయోజనాలు ఉన్నాయని చెబుతున్నారు. సీమ చింతకాయలలో అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. గులాబీ, ఎరుపు, తెలుపు రంగుల్లో ఉండే సీమ చింతకాయలు కాస్త తీయ్యగా, వగరుగా ఉంటాయి. కానీ, ఇందులోని పోషకాల విషయానికి వస్తే.. విటమిన్ ఎ, బి, సి, మెగ్నీషియం, ఐరన్, కాపర్, పాస్ఫరస్, ప్రోటీన్స్, యాంటీఆక్సిడెంట్స్ పుష్కలంగా నిండివున్నాయి. సీమ చింతకాయలు రోగనిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తాయి. వీటిని తినడం వల్ల ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళన వంటి సమస్యలు దూరం అవుతాయి. జ్ఞాపకశక్తి, మానసిక స్థితి, ఏకాగ్రతను పెంచుతాయి. సీమ చింతకాయలో ఉండే విటమిన్ సి రోగనిరోధక శక్తిని పెంచి కఫాన్ని తగ్గిస్తుంది. గొంతు, చిగుళ్లు, నోటిపూత నివారణకు ఉపయోగపడుతుంది. సీమ చింతకాయలు తరచూ తినడం వల్ల మధుమేహం వ్యాధిగ్రస్తులకు కూడా మంచిదని నిపుణులు చెబుతున్నారు. సీమ చింతకాయలు రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతాయి. అకలి తగ్గుముఖం పడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ ఆకలిని నియంత్రిస్తుంది. తద్వారా ఈజీగా వెయిట్ లాస్ అవుతారు. పీచు పదార్థాలు అధికంగా ఉండి, కొవ్వు పదార్థాలు తక్కువగా ఉంటాయి. సీమ చింతకాయలోని గుణాలు గుండె ఆరోగ్యానికి మంచిది. ఇందులో ఉండే పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు రక్తంలో కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రణలో ఉంచుతాయి. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. రక్తపోటును సమతుల్యంగా ఉంచడంలో సీమ చింతకాయ మరింత మేలు చేస్తుంది. క్షయవ్యాధి నివారణకు ఈ చెట్టు వేర్లు బాగా పనిచేస్తాయి.

# ఉదయాన్నే ఒకే ఒక్క గ్లాస్ తాగితే చాలు

## - దెబ్బకు శరీరం మొత్తం క్లీన్..



ఉరుకులు పరుగుల జీవితంలో ఎన్నో సమస్యలు వెంటాడుతున్నాయి.. ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు మంచి జీవనశైలిని అవలంభించడం.. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా మంచిది. అలాంటి మంచి ఆహారాలలో బార్లీ ఒకటి.. పోషకమైన తృణధాన్యమైన బార్లీ గింజలను పురాతన కాలం నుంచి ఆరోగ్య ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు. బార్లీ నీరు శరీరాన్ని డీటాక్సిఫై చేయడమే కాకుండా అనేక వ్యాధులను నివారిస్తుంది. ఎన్నో పోషకాలు దాగున్న బార్లీని చాలా మంది నిపుణులు గరిబోళ్ల సంజీవని అంటారు.. ఆయుర్వేదంలో దీనిని అద్భుతమైన ఔషధంగా పేర్కొంటారు.. బార్లీ నీటిని ఉదయాన్నే రెగ్యులర్‌గా తాగడం వల్ల చాలా ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.. ఇది హైడ్రేషన్, జీర్ణక్రియకు సహాయపడుతుంది.. కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. శరీరాన్ని నిర్విషీకరణ (డిటాక్సిఫై) చేయడానికి సహాయపడుతుంది. జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: ఫైబర్ %-% యాంటీఆక్సిడెంట్లు వంటి పోషకాలతో నిండి ఉన్న బార్లీ నీరు.. జీర్ణ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణ సమస్యలు, గ్యాస్, గుండెల్లో మంట, మలబద్ధకం లాంటి పొట్ట సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది. మూత్రపిండాలు క్లీన్ అవుతాయి: బార్లీ నీటిని తాగడం వల్ల శరీరం నుండి అన్ని హానికరమైన పదార్థాలు తొలగిపోతాయి.. దీంతో శరీరం డిటాక్సిఫై అవుతుంది. అంతేకాకుండా బార్లీ మూత్రపిండాలలో హానికరమైన పదార్థాలు పేరుకుపోకుండా నిరోధించడంతోపాటు.. రాళ్లు, ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.

బరువు తగ్గుతుంది: బరువు తగ్గడానికి బార్లీ నీటిని క్రమం తప్పకుండా తాగవచ్చు. బార్లీ చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్లను తగ్గించి బరువు తగ్గడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా బార్లీనీరు డీహైడ్రేషన్ ప్రమాదం నుంచి కాపాడుతుంది. శరీరాన్ని చల్లగా ఉంచడంలో సహాయపడుతుంది. రక్తపోటును అదుపులో ఉంచి.. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది: అధిక రక్తపోటుతో బాధపడే వారు బార్లీ నీటిని తాగవచ్చు. బార్లీ నీరు అధిక రక్తపోటును అదుపులో ఉంచి.. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

# ఉదయాన్నే ఈ లక్షణాలు ఉన్నాయా..

## రక్తంలో షుగర్ లెవెల్స్ పెరిగినట్లే!



మధుమేహం ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేస్తున్న ఒక సాధారణ ఆరోగ్య సమస్య. దీనిని సకాలంలో గుర్తించి, నియంత్రించకపోతే తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు శరీరం కొన్ని సంకేతాలను చూపుతుంది. ముఖ్యంగా ఉదయం పూట ఈ లక్షణాలు స్పష్టంగా కనిపించవచ్చు. వీటిని ముందుగానే గుర్తించడం ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చు. మధుమేహం ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేస్తున్న సాధారణ ఆరోగ్య సమస్య. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినప్పుడు శరీరం కొన్ని సంకేతాలను చూపుతుంది, ముఖ్యంగా ఉదయం పూట. ఈ లక్షణాలను ముందుగానే గుర్తించడం ద్వారా ప్రమాదాన్ని నివారించవచ్చు. అధిక దాహం, అలసట, మసక దృష్టి వంటివి ప్రధాన లక్షణాలు.మీరు రాత్రిపూట చాలా నీరు తాగనప్పటికీ, ఉదయం లేవగానే విపరీతమైన దాహం వేయడం, లేదా రాత్రిపూట తరచుగా మూత్ర విసర్జనకు వెళ్లాల్సి రావడం అధిక రక్త చక్కెర స్థాయిలకు సంకేతం కావచ్చు.రాత్రి బాగా నిద్రపోయినప్పటికీ, ఉదయం నిద్రలేవగానే తీవ్రమైన అలసట, శక్తి లేనట్లు అనిపించడం కూడా రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగినట్లు సూచిస్తుంది. శరీర కణాలు గ్లూకోజ్‌ను సరిగా గ్రహించలేకపోవడం వల్ల ఇలా జరుగుతుంది.ఉదయం లేచినప్పుడు దృష్టి మసకబారినట్లు అనిపించడం, లేదా వస్తువులు స్పష్టంగా కనిపించకపోవడం అధిక రక్త చక్కెర స్థాయిలకు మరో సూచన. ఇది కంటి లెన్స్‌లోని ద్రవ స్థాయిలలో మార్పుల వల్ల సంభవిస్తుంది.చిన్నపాటి గాయాలు లేదా కోతలు సాధారణం కంటే ఎక్కువ సమయం తీసుకోవడం కూడా అధిక రక్త చక్కెర స్థాయిలను సూచిస్తుంది. అధిక చక్కెర స్థాయిలు రక్త ప్రసరణను ప్రభావితం చేస్తాయి, దీనివల్ల గాయాలు నెమ్మదిగా నయమవుతాయి. పునరావృతమయ్యే ఫంగల్ ఇన్ఫెక్షన్లు, మూత్రనాళ ఇన్ఫెక్షన్లు లేదా చర్మ ఇన్ఫెక్షన్లు వంటివి రోగనిరోధక శక్తి బలహీనపడటం వల్ల సంభవిస్తాయి, ఇది తరచుగా అధిక రక్త చక్కెర స్థాయిల కారణంగా ఉంటుంది. ప్రయత్నించకుండానే బరువు తగ్గడం కూడా మధుమేహం యొక్క లక్షణం కావచ్చు. శరీరం శక్తి కోసం కొవ్వును, కండరాలను ఉపయోగించుకోవడం వల్ల ఇది జరుగుతుంది. ఈ లక్షణాలు మీకు ఉదయం పూట తరచుగా కనిపిస్తే, నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. ముందస్తు నిర్ధారణ మరియు చికిత్స మధుమేహాన్ని సమర్థవంతంగా నిర్వహించడానికి సహాయపడుతుంది.

# మొలకలతో ఎన్నో లాభాలు..!

మొలకలలో ఉండే పోషకాలు మన శరీరాన్ని ముఖ్యంగా గుండె ఆరోగ్యాన్ని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. మొలకల్లో పొటాషియం అధికంగా ఉండటం వల్ల రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే వీటిలో కొలెస్ట్రాల్ చాలా తక్కువగా ఉండటం వల్ల గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. కాబట్టి మొలకలు గుండె ఆరోగ్యానికి చాలా మంచివి. మొలకలు కేవలం గుండెకు మాత్రమే కాదు.. శరీరంలోని ఇతర భాగాలకు కూడా ఎంతో మేలు చేస్తాయి. వీటిలో విటమిన్ జ, విటమిన్ ఖ, ఫోలేట్, ఫైబర్, ఖనిజాలు, అనేక ఎంజైమ్ లు పుష్కలంగా ఉంటాయి. ఈ పోషకాలన్నీ కలిపి మొలకలను సూపర్ ఫుడ్ జాబితాలో చేర్చాయి. వీటిలోని ఫైబర్ శరీరంలో జీర్ణక్రియను మెరుగుపరుస్తూ ఆహారం సరిగ్గా జీర్ణం అయ్యేలా సహాయపడుతుంది. దీని వల్ల కడుపులో ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు సులభంగా తగ్గిపోతాయి. మొలకల్లో ఉండే యాంటీఆక్సిడెంట్లు శరీరంలో ఉన్న హానికరమైన ఫ్రీ రాడికల్స్ ను తొలగించడానికి సహాయపడతాయి. ఇవి శరీరం లోపల ఉన్న కణాలను ఆరోగ్యంగా కాపాడుతూ కొత్త కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. కొల్లాజెన్ వల్ల చర్మం నిబ్బరంగా మెరుగైన రీతిలో ఉంటుంది. అందుకే మొలకలు చర్మ యవ్వనాన్ని కాపాడటానికి చాలా అవసరమైనవి. మొలకల్లో అధికంగా ఉండే విటమిన్ జ మన రోగనిరోధక శక్తిని బాగా పెంచుతుంది. దీని వల్ల శరీరం వ్యాధులు, ఇన్ఫెక్షన్లకు నిరోధకంగా మారుతుంది. సీజనల్ ఫ్లూ, కఫం, జలుబు వంటి సమస్యలు తగ్గిపోతాయి. ఒక విధంగా విటమిన్ జ శరీర రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. మొలకల్లో ఉండే ఫోలేట్, విటమిన్ ఖ మెదడు పని తీరును మెరుగుపరుస్తాయి. ఫోలేట్ మానసిక శక్తిని పెంచి జ్ఞాపకశక్తిని మెరుగుపరుస్తుంది. అలాగే విటమిన్ ఖ రక్త కణాల ద్వారా రక్త ప్రసరణకు సహాయపడటం వల్ల మెదడులో ఆక్సిజన్ సరఫరా మెరుగుపడుతుంది. వీటి కారణంగా మన మెదడు చురుకుగా, జాగ్రత్తగా పని చేస్తుంది. మొలకల్లోని పోషకాల వల్ల శరీరం ఆరోగ్యవంతంగా ఉండటమే కాక మానసిక శాంతి, శక్తి, ఆరోగ్యకరమైన జీవనశైలి ఏర్పడటానికి కూడా సహకరిస్తుంది. మీ రోజువారీ ఆహారంలో మొలకలను చేర్చుకోవడం వల్ల మీరు శరీరానికి కావాల్సిన పలు ముఖ్యమైన పోషకాలను సులభంగా అందించుకోవచ్చు.



# ఈ సీడ్‌ని తక్కువ అంచనా వేయకండి..!



మామిడి కాయను తిన్న తర్వాత చాలా మంది దాని టెంకను పారేస్తుంటారు. కానీ వైద్య నిపుణులు ఏం చెబుతున్నారో తెలుసా..? ఈ చిన్న టెంకలో ఎన్నో విలువైన పోషకాలు, ఔషధ గుణాలు దాగి ఉన్నాయి. ఇది మన ఆరోగ్యాన్ని చాలా బలపరుస్తుంది. ముఖ్యంగా డయాబెటిస్, జీర్ణక్రియ, ఎముకల బలానికి ఇది సహాయపడుతుంది. మామిడి టెంక పొడిని తినడం వల్ల రక్తంలో గ్లూకోజ్ స్థాయిని అదుపులో ఉంచవచ్చు. ఇది ముఖ్యంగా షుగర్ వ్యాధితో బాధపడేవారికి ఉపయోగపడుతుంది. శరీరం ఇన్సులిన్ కు బాగా స్పందించేలా చేసి గ్లూకోజ్‌ను సరిగ్గా ఉపయోగించుకునేలా చేస్తుంది. దీని వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా పెరగకుండా ఉంటాయి.మామిడి టెంకలో ఉండే విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు శరీర రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తాయి. ఇవి వైరస్ లు, బాక్టీరియాల వల్ల వచ్చే ఇన్ఫెక్షన్ల నుండి రక్షణ కల్పిస్తాయి. ఈ పోషకాల వల్ల శరీరం త్వరగా రోగాలను ఎదుర్కొనే శక్తిని పొందుతుంది.ఈ టెంకలో ఉండే సహజ పదార్థాలు కాలేయానికి సహాయపడతాయి. మామిడి టెంకలోని యాక్టివ్ కాంపౌండ్లు కాలేయాన్ని శుభ్రం చేసి దాని పని తీరును మెరుగుపరుస్తాయి. దీని వల్ల కాలేయం బలంగా పని చేసి మలినాలను సులభంగా బయటకు పంపగలుగుతుంది.మామిడి టెంకలో కాల్షియం, ఫాస్ఫరస్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యానికి చాలా అవసరం. ఈ ఖనిజాల వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. పెద్దలకే కాకుండా పిల్లల ఎదుగుదలకు కూడా ఈ టెంక పొడి చాలా ఉపయోగపడుతుంది. ఈ టెంకలో శరీర మంటను తగ్గించే గుణాలు ఉంటాయని పరిశోధనలు చెబుతున్నాయి. శరీరంలో ఏర్పడే అంతర్గత మంటలు, కీళ్ల నొప్పులు వంటి సమస్యలకు ఇది ఉపశమనం ఇస్తుంది. ముఖ్యంగా కీళ్ల నొప్పులు ఉన్నవారికి ఈ టెంక పొడి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.మామిడి టెంకను పొడి చేసి తినడం ద్వారా జీర్ణక్రియ వ్యవస్థ సక్రమంగా పని చేస్తుంది. ఈ పొడిలోని ఫైబర్ పదార్థాలు అజీర్ణం, కడుపులో వాయువు, గ్యాస్ వంటి సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. రోజూ ఈ పొడిని కొద్దిగా తీసుకుంటే జీర్ణక్రియ బాగా జరుగుతుంది.మామిడి టెంక నుంచి తీసే నూనె చర్మానికి సహజమైన మాయిశ్చరైజర్ లా పని చేస్తుంది. ఇది పొడి చర్మాన్ని మృదువుగా చేస్తుంది. టెంక పొడిని తేనె లేదా పాలతో కలిపి ముఖానికి ఫేస్ ప్యాక్ లా వాడితే చర్మం మెరిసేలా తయారవుతుంది. మొదట మామిడి టెంకలను బాగా ఎండబెట్టాలి. ఆ తర్వాత మిక్సీలో వేసి సన్నని పొడి చేసుకోవాలి. ఈ పొడిని రోజూ టీలో కలిపి తాగవచ్చు.

# నేటి ప్రజావాణి కార్యక్రమం రద్దు

**- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) జిల్లా సమీకృత కార్యాలయ భవనం (కలెక్టరేట్) లో సోమవారం నాడు (16.06.2025) నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రకటనలో తెలిపారు. కావున ప్రజలు వివిధ సమస్యలపై వినతులు ఇవ్వడానికి కలెక్టరేట్ కు రావద్దని విజ్ఞప్తి చేశారు. పరిపాలన పరమైన కారణాల దృష్ట్యా సోమవారం ప్రజావాణి కార్యక్రమం ను రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ఈ ప్రకటనలో తెలియజేశారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించవలసినదిగా కోరినారు.

## ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఇంట్లో

# డిప్యూటీ సీఎం జన్మదిన వేడుకలు

**టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములును**



**సన్మానించిన ఎమ్మెల్యే**

కొత్తగూడెం (ప్రశ్న న్యూస్) ఎమ్మెల్యే రాందాస్ స్వగృహంలో తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరిపారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు కేక్ కట్ చేసి డిప్యూటీ సీఎంకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తన పాదయాత్రతో మల్లు బట్టి విక్రమార్క కీలక భూమిక పోషించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఇటీవల టీపీసీసీ జనరల్ సెక్రటరీగా నియమితులైన నాగా సీతారాములును ఎమ్మెల్యే రాందాస్ నాయక్ శాలువాతో సన్మానించి సత్కరించారు.

## మంత్రి హోదాలో తొలిసారిగా రాజన్న క్షేత్రానికి

# విచ్చేసిన రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు ప్రభుత్వ విప్, కలెక్టర్ ఘన స్వాగతం**

**- నేడు ఉదయం శ్రీ రాజన్న దర్శించుకోనున్న మంత్రి**



వేములవాడ, (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాగంగా మంత్రి పదవి చేపట్టిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ,ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదివారం మంత్రి హోదాలో తొలిసారిగా వేములవాడకు విచ్చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆయనకు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలతో సత్కరించి ఆత్మీయంగా పలకరించారు. మంత్రి ఆదివారం రాత్రి వేములవాడలో బసచేసి, నేడు సోమవారం ఉదయం శ్రీ రాజరాజేశ్వర స్వామివారి దర్శనం చేయనున్నారు. ఈ సందర్భంగా వేములవాడ ఆలయ పరిసరాలు భద్రతాపరంగా గట్టి చర్యలు తీసుకున్నారు. మంత్రి స్వాగత కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, వేములవాడ ఏఎస్పీ శేషాద్రి రెడ్డి, ఇంచార్జి ఆలయ ఈఓ, వేములవాడ ఆర్డీఓ రాధాబాయి, సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం

# ప్రభుత్వం అహర్నిశలు కృషి

**- మంత్రి గడ్డం వివేకానంద**

చెన్నూరు : తెలంగాణ రాష్ట్ర ప్రజలకు బంగారు భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. ఆదివారం జిల్లాలోని మందమర్రి మండలం సంద్రన్ పల్లి గ్రామంలోని కెఆర్ గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిందని పేర్కొన్నారు. సొంత ఇంటి స్థలం కలిగి ఉండి అర్హత కలిగిన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పథకం క్రింద రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం, ఉచితంగా ఇసుకను అందజేస్తుందని పేర్కొన్నారు. గతంలో రూ. 5 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.10 లక్షలకు పెంచిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలోని సోమనపల్లిలో 200 కోట్ల రూపాయల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం 50 వేల ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేస్తుందని వివరించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సంబంధిత సమస్యలపై దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలల నుంచి రూ. 2, 500 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా 419 మంది లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలను పంపిణీ చేశారు. రైతు భీమా పథకం క్రింద 6 మంది లబ్ధిదారుల కుటుంబాలకు చెక్కులు అందజేశారు. మండలంలోని సారంగపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొరకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాస్ రావు, మందమర్రి మండల తహసీల్దార్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అమాయకుపై ఎంఐఎం కార్యకర్తల

# దౌర్జన్యాలను అడ్డుకోవాలి: మాధవీలత

**అక్రమ అపార్ట్మెంట్ను అడ్డుకున్నాడని దాడి**

**నగరంలో విచ్చలవిడిగా అక్రమ అపార్ట్మెంట్లు**

అక్రమ అపార్ట్మెంట్లు అడ్డుకుంటే దాడులు లేదా అక్రమ కేసులు మలక్ పేట్ (ప్రశ్నాన్యూస్) హైదరాబాద్ నగర పాత బస్తీలో ఎంఐఎం కార్యకర్తలచే అమాయకులపై జరుగుచున్న దౌర్జన్యాలను వెంటనే అడ్డుకోవాలని హైదరాబాద్ పార్లమెంట్ స్థానం బీజేపి అభ్యర్థి మాధవీలత ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. మలక్ పేట్ పరిధిలోని ఆస్మాన్ ఘడ్ ప్రాంతంలోని వెంకటాద్రినగర్ కాలనీలోని ఎలైట్ హిల్స్ అపార్ట్మెంట్లో అక్రమ నిర్మాణాన్ని అడ్డుకున్న అపార్ట్మెంట్ వాసి బ్రహ్మానందం పై దాడులకి పాల్పడిన ఎఐఎం కార్యకర్తలను కఠినంగా శిక్షించాలని మాధవిలత డిమాండ్ చేశారు. అమాయకులైన కాలనీ వాసులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్న అసాంఘిక శక్తులను కఠినంగా శిక్షించాలని, లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ దాడిలో బాధితులైన అపార్ట్మెంట్ వాసులను రాష్ట్రీయ వానరసేన సభ్యులు, స్థానిక కార్పోరేటర్. కొత్తకాపు అరుణ రవీందర్ తో కలిసి మాధవీలత పరామర్శించారు. ఈ సందర్భంగా ఎంఐఎం కార్యకర్తలచే దాడికి



గురైన అపార్ట్ మెంట్ బాధితులతో మాధవీలత మాట్లాడుతు అపార్ట్మెంట్ వాసులు ఎలాంటి భయాందోళనలకు గురికావలసిన అవసరం లేదని ఏ ఆపద వచ్చినను తామంతా మీ వెంటె ఉన్నామని భరోసా కల్పించారు. గతంలో అపార్టుమెంట్లో ప్రతిష్టించిన వినాయక విగ్రహాన్ని దుండగులు మూడు సార్లు అక్రమంగా తొలగించడంతో రాష్ట్రీయ వానరసేన సభ్యులు, బీజేపి నాయకులు అపార్ట్మెంట్ వాసులతో కలిసి మాధవిలత గణపతి విగ్రహాన్ని పున: ప్రతిష్టించారు. అనంతరం దాడికి గురైె సాయి నర్సింగ్ హోం లో చికిత్స పొందుతున్న అపార్ట్మెంట్



వాసి బ్రహ్మానందం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ వానరసేన జాతీయ అధ్యక్షులు నామ్ రామ్ రెడ్డి, వ్యవస్థాపక సభ్యులు మాధవరెడ్డి, వానరసేన సభ్యులు, భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కేంద్రం ఆమోదం లేకుండానే ఎన్నికలు?

# బీలను మళ్ళీ మోసం చేసేందుకు కుట్ర??

**- ఎన్నికల ముహూర్తం ఖరారు అయ్యేనా...!**

**బీసీ బిల్లులపై ఉలుకు పలుకే లేదు..!!**

**- బీసీ సాధికారత సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు : పొలాస నరేందర్**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు ముహూర్తం ఖరారు అయ్యేనా? ఒకవేళ ఖరారైతే బీసీ రిజర్వేషన్ల బిల్లుల విషయంలో మాత్రం ఉలుకు పలుకు లేకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తోందని, బీసీ సాధికారిత సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు పొలాస నరేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. మార్చి 17న రాష్ట్ర అసెంబ్లీ, మండలిలో ఏకగ్రీవంగా ఆమోదించిన బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లులను గవర్నర్ ఆమోదానికి పంపినట్లు ప్రభుత్వం తెలిపినా, ఆ బిల్లులు కేంద్రానికి పంపించాయా లేదా? పంపితే కేంద్రం నుంచి ఇప్పటివరకు స్పందన ఎందుకు రాలేదన్న విషయమై స్పష్టత లేదన్నారు. “రాజకీయ లబ్ధికోసం బీసీలను మభ్యపెట్టి, బిల్లులపై మౌనం కొనసాగితే... మరో బీసీ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడకుండా ఉండదు”అని పొలాస నరేందర్ హెచ్చరించారు.

**- 1995 ఉదాహరణ మళ్లీ జరగవద్దు!**

1995లో బీసీ రిజర్వేషన్లతో ఎన్నికైన సర్పంచులకు కోర్టు స్టే ఇవ్వడంతో, ఆరు నెలల పాటు అధికారాలు బదిలీ కాకపోవడం, పాత సర్పంచులనే కొనసాగించడమన్న దురదృష్టకర ఘటన మళ్లీ పునరావృతం కాకూడదన్నారు. బిల్లులు కేంద్రానికి పంపినట్లయితే, పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు (జూలై 21 – ఆగస్టు 12) వరకు ఆగాల్సిందేనా? లేదా మరో ప్రత్యామ్నాయ మార్గం ఉందా అనే దానిపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**- కేంద్ర ఆమోదం లేకుండా ఎన్నికలు నిర్వహించటం చట్టబద్ధమా?**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అంశంపై ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. కేంద్ర ఆమోదం పొందకుండానే ఎన్నికలు నిర్వహిస్తే, అది చట్టబద్ధతను కోల్పోయే ప్రమాదం ఉందని గుర్తుచేశారు.

**- స్పష్టమైన ప్రకటన ఇవ్వాలి!**

తదుపరి క్యాబినెట్ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికల తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. కానీ బీసీ రిజర్వేషన్ల బిల్లులపై స్పష్టత లేకుండా ఎలాంటి ప్రకటనలు ఇవ్వడం బీసీలలో అయోమయం పెంచుతోందని అన్నారు.”చట్టబద్ధంగా, శాస్త్రీయంగా బీసీ రిజర్వేషన్లతో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీల ఆశయాన్ని ప్రభుత్వం గౌరవించాలని”పొలాస నరేందర్ కోరారు.

## అదుపుతప్పిన స్కార్పియో..

# తర్వాత ఏం జరిగిందంటే?

లక్నో: డ్రైవర్ మద్యం సేవించి డ్రైవింగ్ చేయడంతో మహీంద్రా స్కార్పియో ఎస్‌యూవీ అదుపుతప్పింది. నిర్మాణంలో ఉన్న గోడను ఢీకొట్టింది. ఆ తర్వాత ఆగి ఉన్న ఈ ఆటోపైకి అది దూసుకెళ్లింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉత్తరప్రదేశ్‌లోని మెయిన్‌పురి జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

ఆదివారం అచల్‌పూర్ గ్రామం సమీపంలో వేగంగా వెళ్తున్న స్కార్పియో అదుపు తప్పింది. నిర్మాణంలో ఉన్న గోడను ఢీకొట్టింది. ఆ తర్వాత అక్కడున్న ఎలక్ట్రిక్ ఆటోపైకి అది దూసుకెళ్లింది. దీంతో ఆటో ధ్వంసమైంది. కాగా, ఇది చూసి గ్రామస్తులు అక్కడ గుమిగూడారు. స్కార్పియోలో ఉన్న డ్రైవర్, మరో వ్యక్తి మద్యం సేవించారని ఆరోపించారు. మరో రోడ్డు ప్రమాదం నుంచి తప్పించుకునే క్రమంలో ఈ సంఘటనకు పాల్పడినట్లు చెప్పారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకున్నారు. స్కార్పియో, ధ్వంసమైన ఈ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# ప్రజా సమస్యలపై నిరంతరం ఉద్యమిస్తాం

**- సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్**

సిద్దిపేట : ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ఉద్యమిస్తామని సీపీఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. ఆదివారం రోజు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని స్థానిక ఎడ్ల గురువారెడ్డి భవన్ లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన సీపీఐ సిద్దిపేట పట్టణ16వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ.. పేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సీపీఐ అన్నారు. సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీ అన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలలో అర్హులకు ప్రాధాన్యత ఇచ్చేలా ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు.

ప్రతి పంచాయతీలో,పట్టణంలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాలలో అర్హులైన వారందరికీ ప్రాధాన్యత ఇవ్వకుండా అనర్హులకు ఇస్తే పోరాటం చేస్తామన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పై కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు పూర్తి అవగాహనతో ప్రజాసమస్యలపై స్పందించాలని పిలుపునిచ్చారు.. అనంతరం సీపీఐ సిద్దిపేట పట్టణ నూతన కమిటీని 17 మంది కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా గజబీంకార్ బన్సీలాల్, పట్టణ సహాయ కార్యదర్శులుగా ఎస్కే హరిఫ్, కర్ణాల చంద్రంలను, కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల శంకర్, అందె అశోక్, పిట్టల మల్లేశం, మిట్టపల్లి సుధాకర్, బెక్కంటి సంపత్, వేల్పుల ప్రసన్న కుమార్, కానుగుల రామనకర్, భిక్షపతి, శ్రీనివాస్, రాజు, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షానికి కూలిన ప్రహరీ గోడ..

# తర్వాత ఏం జరిగిందంటే?



బెంగళూరు: భారీ వర్షానికి ప్రహరీ గోడ కూలింది. ఆ ప్రాంతంలో వర్షం నీరు నిలిచి ఉండటంతో ఎదురుగా ఉన్న ఇంట్లోకి భారీగా వర్షం నీరు ప్రవాహించింది. వర్షం నీటి ప్రవాహం ధాటికి ఆ ఇంటి గేటు విరిగిపడింది. అలాగే విద్యుత్ స్పార్క్లు కూడా కనిపించాయి. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కర్ణాటకలోని మంగళూరులో ఈ సంఘటన జరిగింది. దక్షిణ కన్నడ జిల్లాతో సహా తీరప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కూడా ఆ ప్రాంతానికి రెడ్ అలర్ట్ జారీ చేసింది.కాగా, శనివారం మంగళూరులో కుండపోతగా వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అయితే భారీ వర్షాలకు ఒక ఇంటి కాంపౌండ్ గోడ కూలిపోయింది. వీధిలోని రోడ్డుపై నిలిచి ఉన్న వర్షం నీటిలో అది పడింది. దీంతో ఆ వర్షం నీరు పెద్ద ప్రవాహం మాదిరిగా ఎదురుగా ఉన్న ఇంట్లోకి చేరింది. మరోవైపు ఆ వర్షం నీటి ఉధృతికి ఆ ఇంటి గేటు విరుగడంతోపాటు దూరంగా పడింది. అలాగే విద్యుత్ పోల్ దెబ్బతినడంతో స్పార్క్లు కూడా వచ్చాయి. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు. ఇది చూసి ఆ ఇంటి వారు భయాందోళన చెందారు. ఆ ఇంటి ప్రాంగణంలోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

# బీఆర్ఎస్ నేతలపై పెట్టే కేసుల ఎఫ్ఐఆర్‌లు..

**గాంధీ భవన్‌లో రెడీ అవుతున్నాయి.. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఫైర్**

బీఆర్ఎస్ నేతలపై పెట్టే కేసుల ఎఫ్ఐఆర్‌లు గాంధీభవన్‌లోనే రెడీ అవుతున్నాయని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో సీక్రెట్ ఎఫ్ఐఆర్‌లు తయారవుతున్నాయని.. వాట్సాప్‌లో స్టేటస్ పెట్టినా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నాయకులపై పెడుతున్న అక్రమ కేసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులపై పెడుతున్న కేసులన్నీ తప్పుడు కేసులే అని ఒక మాజీ పోలీసు అధికారిగా చెబుతున్నానని స్పష్టం చేశారు. కొణతం దిలీప్‌పై ఆదిలాబాద్ జిల్లాలో అక్మ కేసులు పెట్టారని.. ఆయన్ను నిర్మల్ పోలీసులు మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. నిర్మల్ కోర్టు మెజిస్ట్రేట్ దిలీప్‌కు బెయిల్ ఇస్తే వెంటనే కడెం పోలీసులు వచ్చారని పేర్కొన్నారు. ఇదెక్కడి ఆటవిక న్యాయమని ఆయన ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి పాలనలో సీక్రెట్ ఎఫ్ఐఆర్‌లు అవుతున్నాయని మండిపడ్డారు. వాట్సాప్‌లో స్టేటస్‌లు పెట్టినా కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఆయిల్‌ఫాం సాగుతో అధిక లాభాలు

**- ఆయిల్ ఫాం రాష్ట్ర టెక్నికల్ అడ్వైజరీ రంగనాయకులు**

వెల్దుర్తి : ఆయిల్ ఫాం సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఆయిల్‌ఫాం రాష్ట్ర టెక్నికల్ అడ్వైజరీ రంగనాయకులు అన్నారు. ఆదివారం వెల్దుర్తి మండల పరిధిలోని ఎల్కపల్లి గ్రామశివారులో రైతు సత్యనారాయణ సాగు చేస్తున్న ఆయిల్‌ఫాం మొక్కలను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల ఆర్థికాభివృద్ధికి ఆయిల్‌ఫాం సాగు ఎంతగానో దోహదపడుతుందని, ఆయిల్‌ఫాం సాగుతో నీటిని ఆదా చేయడంతోపాటు అంతర పంటల సాగు ద్వారా మరింత ఆదాయం వస్తుందన్నారు. ఈ ఆయిల్‌ఫాం సాగు 40 ఏండ్ల పాటు సాగు అవుతుందని, ఏడాదికి రూ. 1.50 లక్షల లాభం వస్తుందన్నారు.ఈ పంటను పశువులు, అడవి జంతువులు నాశనం చేయవని, దళారీల మోసం, తాలు సమస్య ఈ పంటలో ఉండదని, పరిశ్రమలు నేరుగా రైతుల నుండి పంటను కొనుగోలు చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా 259 లక్షల టన్నుల ఆయిల్ ఫాం వాడకం జరుగుతుండగా, కేవలం 97 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతుందన్నారు.కేంద్ర ప్రభుత్వం ఆయిల్ ఫాం సాగును పెంచేందుకు రాయితీ ఇస్తుందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీరి వెంట జిల్లా మేనేజర్ కృష్ణారావు, డిప్యూటీ మేనేజర్ అశోక్‌లతో పాటు పలువురు ఉన్నారు.

## ఫర్నీచర్ గోదాములో అగ్నిప్రమాదం..

# ఎగిసిపడుతున్న అగ్నికీలలు..

ఫర్నీచర్ గోదాము లో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ముందుగా స్క్రాప్ షాపు లో చెలరేగిన మంటలు తర్వాత పక్కనే ఉన్న ఫర్నీచర్ గోదాముకు అంటుకున్నాయి. మహారాష్ట్ర లోని పుణె నగరంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గోదాములోని ఫర్నీచర్‌కు మంటలు అంటుకోవడంతో పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడ్డాయి. పుణెలోని చించ్వాడ్ నగర్ ఏరియా జరిగిన ఈ ప్రమాదం గురించి స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దాంతో హుటాహుటిన ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్‌ల సాయంతో మంటలను ఆర్పేసింది. ప్రమాదంలో భారీగా ఆస్తినష్టం సంభవించిందని అధికారులు తెలిపారు. ప్రమాదానికిగల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

# మృతుడు హరీష్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేసిన మిత్రబృందం



బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామానికి చెందిన కుంటాల హరీష్ ఇటీవల ఆత్మహత్య చేసుకొని మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేస్తూ హరీష్ ఎస్సెస్సీ బ్యాచ్ మిత్రబృందం ఆదివారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి, మృతుని కుటుంబానికి 20 వేల రూపాయల నగదు ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలువేరి నాగరాజు, బండారి మహేందర్, సావనపల్లి అనిల్, విలాసాగర్ వెంకటేష్, కుంట వెంకటేష్, దూస వెంకటేష్, కె.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. మిత్రుడి కుటుంబానికి సాయం చేయడం తమ బాధ్యతగా భావించి ఈ సహాయ కార్యక్రమాన్ని చేపట్టినట్టు వారు తెలిపారు.

# రైతు భరోసా విడుదల కార్యక్రమం



మంథని( ప్రశ్న న్యూస్) రైతులకు పెట్టుబడి సాయం గా రైతు భరోసా విడుదల కార్యక్రమం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరి నుండి ప్రత్యక్ష ప్రసారం సోమవారం ఉంటుందని వ్యవసాయ సహాయ సంచకులు అంజని మిశ్ర ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భరోసా కి సంబంధించిన విధివిధానాలు ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమంలో వివరిస్తారని, అందుబాటులో ఉన్న రైతులందరూ తమ తమ దగ్గరలో గల రైతు వేదికల వద్ద మధ్యాహ్నం మూడు గంటలకు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం వీక్షించగలరని ఆమె సూచించారు. రైతు భరోసా దరఖాస్తు చేయని రైతులు కొత్త పాస్ బుక్ , ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు వ్యవసాయ విస్తరణ అధికారికి నెల 20 లోపు సమర్పించగలరని ఆమె తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి



**జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్) జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో సంస్థాగత ప్రసవాలను పెంచేందుకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు.ఆదివారం మెదక్ జిల్లా కలెక్టర్ కొల్చారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా పరిశీలించారు.దవాఖానలో సిబ్బంది స్టాక్ రిజిస్టర్, మందులు నిల్వల రిజిస్టర్, ఓ.పి రిజిస్టర్ను పరిశీలించి. రోగులకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో సంస్థాగత, సాధారణ ప్రసవాలు , ఆరోగ్య మహిళా కార్యక్రమం,గురించి ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖచ్చితంగా డెలివరీల సంఖ్యను పెంచాలన్నారు. రిస్క్ ఉన్న కేసులను జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి లకు పంపాలని చెప్పారు. ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా గుర్తించిన అనుమానిత క్యాన్సర్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వారిని జిల్లా ఆసుపత్రి కి రిఫరల్ చేస్తూ ఖచ్చితంగా పరీక్షలు చేసుకునేలా మానిటర్ చేయాలన్నారు. ఫ్రైడే డ్రై డే కార్యక్రమం తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో చేపట్టాలన్నారు. జ్వర బాధితులకు టెస్ట్ ల సంఖ్యను పెంచాలన్నారు.డెంగ్యూ , మలేరియా, టైఫాయిడ్ కేసుల ను పూర్తిగా అరికట్టేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. హై రిస్క్ ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు డ్రైడేను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు ప్రధానంగా నీటి నిల్వ లేకుండా జాగ్రత్త పడాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మతల్లి తిరుగు బోనం! వెండి కిరీటం బహూకరణ..!!

**- వెండి కిరీటం దాత**

**- వేముల కార్తీక-డాక్టర్ సత్యం దంపతులు**



బోయినిపల్లి, (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలంలోని తడగొండ గ్రామంలో నూతన పోచమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ఘనంగా తిరుగు బోనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో అదే గ్రామానికి చెందిన వేముల కార్తీక-డాక్టర్ సత్యం దంపతులు అమ్మవారికి శ్రద్ధాపూర్వకంగా వెండి కిరీటం అందజేశారు. పూజా కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారికి మొక్కులు చెల్లించుకొని ఆశీస్సులు పొందారు. అనంతరం అన్నప్రసాదం పంపిణీ నిర్వహించబడింది. గ్రామ ప్రజలు,మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని

# సుదీర్ఘ ప్రణాళిక - సుపరిపాలన

**- రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఏడాది పాలనలో నూతన దిశ**

**- జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టి నేటితో ఏడాది పూర్తి**



రాజన్న సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లాలో ప్రజలతో మమేకమైన పాలన, సంక్షేమ కార్యక్రమాల అమలులో పారదర్శకత, అభివృద్ధికి సంకల్పబద్ధత %-% ఇవన్నీ కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కార్యాచరణలో ప్రతిఫలిస్తున్న అంశాలు. 2024 జూన్‌లో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 2025 జూన్ వరకు, ఏడాది కాలంలో ఆయన పాలన జిల్లాలో కొత్త ఒరవడిని నెలకొల్పింది.

**- ప్రభుత్వ పాఠశాలల్లో 'కలెక్టర్'గానే కాకుండా 'అధ్యాపకుడిగా'**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో విద్యను ప్రోత్సహించేందుకు కలెక్టర్ ప్రత్యేక కృషి చేస్తున్నారు. తన విధి నిర్వహణలో భాగంగా తరచూ పాఠశాలలకు వెళ్లి పిల్లలతో మమేకమై పాఠాలు చెబుతారు. సమర్థవంతమైన బడి బాట కార్యక్రమంతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారు.

**- వైద్యరంగం బలోపేతానికి చొరవ**

ప్రతి మంగళవారం "హాస్పిటల్ విజిట్ డే"గా నిర్వహిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌళిక సదుపాయాలు, మందుల లభ్యత, డాక్టర్ల విధి నిర్వహణ తదితరాలను తానే స్వయంగా తనిఖీ చేస్తున్నారు. ఫలితంగా జిల్లా ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగింది.

**- చేనేత కార్మికులకు చైతన్యం**

చేనేతకు కేరాఫ్ అడ్రస్ అయిన సిరిసిల్లలో వృత్తిని ఆధునీకరించేందుకు కృషి చేశారు. టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. వర్క్‌షాపులు, శిక్షణ తరగతుల ద్వారా కార్మికులకు నూతన నైపుణ్యాలు అందిస్తున్నారు.

**- పేదల కోసం అండగా నిలిచిన కలెక్టర్**

విపత్తుల్లో నష్టపోయిన పేదలకు అండగా నిలుస్తూ, వారి ఇంటికే వెళ్లి ఆర్థిక సాయం అందించడం కలెక్టర్ పాలనా శైలికి అద్దంపడుతుంది. అభాగ్యుల సమస్యలను క్షణాల్లో పరిష్కరించే ధోరణి ప్రజల్లో విశ్వాసం నింపుతోంది.

**- భూ హక్కుల పరిరక్షణకు ప్రత్యేక దృష్టి**

భూభారతి చట్టంపై ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించి, భూ రికార్డుల పకడ్బందీపై ప్రజల్లో చైతన్యం కల్పించారు. రెవెన్యూ వ్యవస్థ పారదర్శకత దిశగా సాగుతుందని ఆయన నమ్మకం.

**- దివ్యాంగులకు ఉపాధి అవకాశాల కల్పన**

దివ్యాంగులు రాష్ట్ర నూతన ఐటీ పాలసీలో భాగస్వాములయ్యేలా కృషి చేస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన "డెఫ్స్ క్యాఫే" ద్వారా దివ్యాంగులకు ఉపాధి కల్పించారు. ఇది రాష్ట్రవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచింది.

**- ప్రతిరోజూ ప్రజల మధ్యే...**

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఉదయం నుంచి రాత్రి వరకు కార్యాలయంలో గడిపే అధికారి కారు - ప్రతి రోజూ పల్లెల్లో ప్రజలతో మమేకమై సమస్యలు తెలుసుకుంటూ, వెంటనే స్పందిస్తూ పాలన సాగిస్తున్నారు. సోషల్ మీడియాలో కూడా స్పందించే కలెక్టర్‌గా ప్రసిద్ధి గాంచారు.

**- ప్రజల విశ్వాసం**

సేవా నిబద్ధత, పారదర్శకత, ప్రజల పట్ల స్పందన - ఈ మూడు మూల సూత్రాలతో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పాలన సాగుతోంది. ఏడాది కాలంలో ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లాలో పాలనకు కొత్త దిశను సృష్టించారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతాయని ప్రజల్లో విశ్వాసం నెలకొంది.

# తెలంగాణ ఉద్యమ గాయకుల త్యాగాలకు గౌరవం కల్పించాలి

**- సాంస్కృతిక సారథిలో కళాకారులకు ఉపాధి కల్పించాలి - తెలంగాణ ఉద్యమ కళాకారుల విభాగం రాష్ట్ర కన్వీనర్ : యెల్ల పోశెట్టి**



వేములవాడ,(ప్రశ్న న్యూస్) "తెలంగాణ రాష్ట్ర సాధన కోసం గజ్జెలు కట్టుకొని, పాటలతో ప్రజల్లో ఉద్యమాన్ని ఉధృతం చేసిన ఉద్యమ కళాకారులను మరవకూడదు" అని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కన్వీనర్,కళాతపస్వి యెల్ల పోశెట్టి పేర్కొన్నారు. కరీంనగర్ కళాభారతిలో ఆదివారం ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు ఘనంగా జరిగిన "పాటల పల్లకి" కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి నేర్నాల కిషోర్ అధ్యక్షత వహించగా,ఉత్తర తెలంగాణ కో-ఆర్డినేటర్ బొడ్డు రాములు,నిర్వాహకులు చక్రాల రఘు,గోనెల సమ్మయ్య,వివిధ జిల్లాల కళాకారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా యెల్లపోశెట్టి మాట్లాడుతూ "తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమ గాయకుల త్యాగం అమోఘం. గోనె గొంగడి,డప్పుతో,వానకే కాదు,అధికారుల భీషణకూ భయపడకుండా పాటలు పాడారు. అయినా, గత ప్రభుత్వాలు వారిని విస్మరించాయి.ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వారిని గుర్తించాలి."అర్హులైన ఉద్యమ గాయకులను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, సాంస్కృతిక సారధిలో కనీసం 1000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. వృద్ధ కళాకారులను రాష్ట్ర సలహాదారులుగా గుర్తించి, నెలకు రూ.25,000 గౌరవ వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమ అనంతరం కరీంనగర్ శ్రీ తాపాలా లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో నిర్వహించిన మహా చండీయాగ ముగింపు వేడుకలో పాల్గొన్న




యెల్లపోశెట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# అధికారుల తీరుపై ప్రజల్లో అసంతృప్తి..

**ఆఫీసులో చుట్టూ ప్రజలు వెంపర్లాడుతున్నారు.**

**పనివేళలో అందుబాటులో ఉండరు..**

**కొందరి అధికారులు తీరుపై ప్రజల మండిపాటు..**

**ఇన్చార్జిలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు..**

**చేతి వాటం ప్రదర్శిస్తున్న కింది స్థాయి అధికారులు..**



మంథని ( ప్రశ్న న్యూస్) మంథని మండలంలో కొందరి అధికారుల తీరుపై ప్రజల్లో అసంతృప్తి నెలకొన్నది. ఎందుకంటే తమ అవసరాల కొరకు సంబంధిత అధికారులకు విన్నవించడానికి కార్యాలయాలకు వస్తుంటారు. కొందరు అధికారులు అయితే ఆఫీస్ పనివేళలో రాకుండా మధ్యాహ్నం సమయంలో కార్యాలయానికి వస్తున్నారు. వారి కొరకు ప్రజలు తమ సమస్యలను చెప్పడానికి వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది. కొందరు అధికారులు అయితే మీటింగ్ ల పేరిట ఆఫీసుకు రాకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.ఆఫీసులో చుట్టూ తిరుగుతున్న కూడా ప్రజల సమస్యలు పరిష్కారం కావడం లేదు.కొందరు అధికారులైతే పనివేళలో అందుబాటులో ఉండడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం నుండి వేలల్లో , లక్షకు పైగా జీతాలు తీసుకొని పనిచేయడం లేదని ప్రజల నుండి విమర్శలు వెళువెత్తుతున్నాయి. ముఖ్యంగా కొందరి అధికారులు తీరుపై ప్రజలు మండి పడుతున్నారు. ముఖ్యంగా మంథనిలో కొందరు అధికారులు ఇన్చార్జిలుగా ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కాలంలో అవినీతి అధికారులు పట్టుబడిన తీరు చూస్తూనే తెలుస్తోంది. ప్రజల సమస్యలను పరిష్కారించడంలో అధికారులు ఏ తీరుగా పనీ చేస్తున్నారోననీ ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రజల సమస్యలు పరిష్కారిష్కారం కొరకు కొందరు కింది స్థాయి అధికారులు చేతి వాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఇప్పటికైన ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# జిల్లా సంక్షేమ శాఖలో పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

**ఆరు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం పరిధిలో వివిధ పోస్టులకు ఆదివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయం పరిధిలో మొత్తం 16 పోస్టులకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసి, దరఖాస్తులు ఆహ్వానించారు. మొత్తం పోస్టులకు గాను 904 దరఖాస్తులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఆరు రకాల పోస్టులు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, ప్రొటెక్షన్ ఆఫీసర్లు(2), లీగల్ ఆఫీసర్, కౌన్సిలర్, సోషల్ వర్కర్ కోసం ఇంటర్వ్యూలు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్హత, పని అనుభవం తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. మిగతా 10 రకాల పోస్టులకు సోమ, మంగళవారాల్లో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం తెలిపారు.



### ముంబై లోకల్ ట్రైన్‌లో నటి మాళవికాకు

# చేదు అనుభవం

## - స్పందించిన ముంబై పోలీసులు

మాళవికా మోహనన్ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తన కాలేజ్ డేస్‌లో రాత్రి 9:30 గంటల ప్రాంతంలో ముంబై లోకల్ ట్రైన్‌లో తన స్నేహితురాళ్లతో కలిసి ప్రయాణిస్తుండగా ఈ సంఘటన జరిగిందని వివరించారు. మేము కూర్చున్న ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ దాదాపు ఖాళీగా ఉందని, అప్పుడు ఒక వ్యక్తి కిటికీ గ్రిల్‌కు దగ్గరగా వచ్చి, ఏక్ చుమ్మా దేగి క్యా? (ఒక ముద్దు ఇస్తావా?) అని అసభ్యంగా అడిగాడని మళావిక తెలిపారు. ఆ సమయంలో తాము ముగ్గురం పూర్తిగా నిస్సహాయంగా ఉండిపోయామని, ఏం చేయాలో తెలియక భయంతో వణికిపోయామని ఆమె పేర్కొన్నారు. సుమారు 10 నిమిషాల తర్వాత తదుపరి స్టేషన్ రావడంతో ప్రయాణికులు కంపార్ట్‌మెంట్‌లోకి రావడంతో తాము ఊపిరి పీల్చుకున్నామని చెప్పారు.అయితే ఈ సంఘటనపై ముంబై పోలీసులు తమ అధికారిక సోషల్ మీడియా అకౌంట్ ద్వారా స్పందించారు. డియర్ మాళవిక గారు.. "మీరు మీ అనుభవాన్ని పంచుకోవడం, నగరంలో మహిళల భద్రతపై ఆందోళన వ్యక్తం చేయడం మేము చూశాం. ఇలాంటి అనుభవాలు షాకింగ్‌గా ఉండటమే కాకుండా దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపిస్తాయని మేము అర్థం చేసుకోగలం. కాబట్టి, పగలు లేదా రాత్రి ఏ సమయంలోనైనా, నగరంలో ఏ ప్రదేశంలోనైనా మీకు ఏదైనా ఇబ్బంది ఎదురైతే, దయచేసి 112/100 నంబర్‌లకు కాల్ చేయండి. మేము వీలైనంత త్వరగా సహాయం అందిస్తాము. ఫిర్యాదు చేయకపోవడం వల్ల నేరస్థులు మరింత ధైర్యం పొందుతారు అని పోలీసులు తెలిపారు. ముంబై నగరం మహిళలకు ఎప్పుడూ సురక్షితమైనది, దానిని మరింత మెరుగుపరచడానికి మేము ఎటువంటి ప్రయత్నం వదిలిపెట్టము. ఒకసారి ఫిర్యాదు చేస్తే, నేరస్థుడిని చట్ట ప్రకారం తగిన విధంగా శిక్షిస్తామంటూ ముంబై పోలీసు విభాగం తెలిపింది.

### చినుకు కురిసింది

# సిరిముువ్వగా..



నరేష్ ఆగస్త్య, రబియా ఖాతూన్ జంటగా నటిస్తున్న చిత్రం 'మేఘాలు చెప్పిన ప్రేమకథ'. విపిన్ దర్శకుడు. ఉమాదేవి కోట నిర్మాత. త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా సినిమాలోని 'సౌండ్ ఆఫ్ లవ్' అనే తొలి గీతాన్ని విడుదల చేశారు. జస్టిన్ ప్రభాకరన్ స్వరపరచిన ఈ పాటను రెహమాన్ రచించారు. సహజసిద్ధమైన శబ్దాలతో ఈ పాటను కంపోజ్ చేసిన విధానం ఆకట్టుకునేలా ఉంది. 'ఒక మెరుపు మెరిసిందిపుడే చిరునవ్వుగా, ఒక చినుకు కురిసిందిపుడే సిరిముువ్వగా..' అంటూ చక్కటి భావాలతో సాగిందీ గీతం. కవితాత్మకంగా సాగే ప్రేమకథా చిత్రమిదని, కథానుగుణంగా సంగీతానికి ప్రాధాన్యత ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. రాధికా శరత్‌కుమార్, తనికెళ్ల భరణి, వెంకటేష్ కాకుమాను, విద్యుల్లేఖ సుమన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జస్టిన్ ప్రభాకరన్, రచన-దర్శకత్వం: విపిన్.

### 'కాంతార' షూటింగ్‌లో నటుడు

# రిషబ్ షెట్టికి ప్రమాదం



కన్నడ నటుడు రిషబ్ షెట్టి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ ప్రాజెక్ట్ కాంతార చాప్టర్1కి వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్న విషయం తెలిసిందే. గతేడాది ఈ సినిమాలో నటిస్తున్న జూనియర్ ఆర్టిస్ట్‌లు ప్రయాణిస్తున్న వ్యాన్‌కు ప్రమాదం చోటు చేసుకోగా.. ఆ తర్వాత కొన్నిరోజులకే కపిల్ అనే నటుడు నదిలో కొట్టుకుపోయి చనిపోయాడు. మరోవైపు అదే నెలలో రాకేశ్ పూజారి అనే మరో నటుడు గుండెపోటుతో కన్నుమూయగా.. నిన్న శనివారం రోజున కాంతారలో నటిస్తున్న మిమిక్రీ ఆర్టిస్ట్ కళాభవన్ నిజూ (43) సైతం గుండెపోటుతో మృతి చెందాడు. అయితే ఈ సంఘటనలు మరవకముందే మరో ప్రమాదం చోటు చేసుకుంది. అయితే ఈ ప్రమాదంలో నటుడు రిషభ్ షెట్టి కూడా ఉండడం విశేషం.ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం కర్ణాటకలోని మాణి జలాశయం వద్ద జరుగుతుండగా.. ఈ షూటింగ్‌లో పాల్గోన్న నటుడు రిషభ్‌షెట్టితో పాటు 30 మంది ఆర్టిస్ట్‌లు కలిసి ప్రయాణిస్తున్న బోట్ ప్రమాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. దీంతో వెంటనే వారందరూ ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటనలో కెమెరాతో పాటు సాంకేతిక పరికారలు కొట్టుకుపోగా.. రిషభ్‌తో పాటు పలువురు నటులు ప్రమాదం నుంచి తప్పించుకున్నారు.

# రానా నాయుడు సీజన్2 రివ్యూ

రెండేండ్ల క్రితం వచ్చి సంచలనం సృష్టించడంతో పాటు తీవ్ర విమర్శల పాలైన వెబ్ సిరీస్ రానా నాయుడు . తాజాగా ఈ సిరీస్ సీక్వెల్ డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చేసింది. విక్టరీ వెంకటేశ్ , రానా , అర్జున్ రామ్‌పాల్ , సుర్వీన్ చావ్లా , కృతి కర్భంద , అభిషేక్ బెనర్జీ సుశాంత్ సింగ్, రజత్ కపూర్ కీలక పాత్రల్లో నటించారు. కరణ్ అన్షుమన్ దర్శకత్వం వహించాడు. అయితే.. ఎన్నో అంచనాల మధ్య నెట్‌ఫ్లిక్స్ ఓటీటీకి వచ్చిన ఈ సిరీస్ గత సీజన్‌ను మరిపించిందా లేక నిరాశ పర్చిందా అనేది ఇక్కడ చూద్దాం. కథ విషయానికి వస్తే.. బిజినెస్ టైక్యూన్లకు, రాజకీయ నాయకులకు, ఇంకా అచాలా మంది సెలబ్రిటీలకు రానా నాయుడు మిడియేటర్‌గా ఉంటూ వ్యవహారాలు చక్కబెట్టి కమీషన్ తీసుకుంటాడు. ఇకపై ఫ్యామిలీ అంతా కలిసి ఉండేందుకే ప్రయారిటీ ఇస్తానని, ఎలాంటి మధ్యస్త వ్యవహారాలకు, వివాదాలకు దూరంగా ఉంటానని భార్యకు హామీ ఇస్తాడు. అయితే రానాని తమ గ్రిప్‌లో ఉంచుకోవాలని ఓరోజు ఓ గ్యాంగ్ అతని కుమారుడిని కిడ్నాప్ చేస్తారు. దాంతో రానా ఓ బిజినెస్ టైకూన్ విరాజ్ ఒబెరాయ్, తన తండ్రి నాగ నాయుడు సాయంతో ఆ గ్యాంగ్‌ను అంతమొందించి తిరిగి ముంబయ్ వచ్చేస్తాడు. అయితే రానా చంపిన వారిలో ముంబై గ్యాంగ్‌స్టర్ రవూఫ్ సోదరుడు కూడా ఉండడంతో రానాపై ఎలాగైనా పగ తీర్చుకోవాలని రవూఫ్ అనేక రకాలుగా ప్రయత్నాలు చేస్తుంటాడు. ఇక.. తన కుమారుడిని కాపాడేందుకు సాయం చేసిన విరాజ్ ఒబెరాయ్ వద్ద రానా పని చేస్తూ అన్ని రకాల వ్యవహారాలు చక్కబెడుతుంటాడు. తండ్రిని కాదని సొంతంగా ఎదగాలని చూస్తున్న అలియా ఒబెరాయ్‌కు కూడా రహస్యంగా హెల్ప్ చేస్తాడు.అయితే మరోవైపు రానాకు దగ్గరైన ఓ పొలిటీషియన్ రానాకు వ్యతిరేఖంగా రవూఫ్‌కు సాయం చేసి జైలు నుంచి బయటకు తీసుకువచ్చి అతని సాయంతో రాజకీయంగా ఎదగాలని చూస్తుంటాడు. కానీ రవూఫ్ ఆ పొలిటీషియన్‌ను కాదని తానే పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇవ్వాలని ప్లాన్లు చేస్తుంటాడు. ఇక నాగా నాయుడు సైతం ఓ గ్యాంగ్ లేడీకి డబ్బులు బాకీ పడడం, రానా అన్న, తమ్ముళ్లు ప్రేమలో పడడం వారు డబ్బు సంపాదించి ఈ వ్యవహారాలకు దూరంగా ఉండాలని ప్రయత్నాలు చేసి ఇబ్బందుల్లో పడతారు. మరోవైపు విరాజ్ ఒబెరాయ్ ఓ తప్పు చేసి ఓ పోలీస్ సాయంతో రానాను అందులో ఇరికిస్తాడు. వెరసి మూడు, నాలుగు గ్రూపులు, అందులో వారి సొంత వ్యవహారాలు, వారు పన్నే కుట్రల నేపథ్యంలో రానా అడ్ ఫ్యామిలీ ఎలా చిక్కుకుంది, అందులో నుంచి ఏవిధంగా బయట పడ్డారనే ఈ రానా నాయుడు సిరీస్ సీజన్2 కథ. కథగా చెప్పుకోవడానికి ఇది రెగ్యులర్ రివేంజ్, యాక్షన్ డ్రామానే అయినా గేమ్ ఆఫ్ థ్రోన్స్ సిరీస్ తరహా గ్రూపులు, ఒకరిని మించి మరొకరు, ఒకరిపై ఒకరు కుట్రల నేపథ్యంలో ఈ సీజన్‌ను తెరకెక్కించినటలు అర్థమవుతుంది. అయితే మొదటి భాగంలో ఉన్నట్లు హింస, అశ్లీల సన్నివేశాలు, అసభ్య పదాల వాడకం 80 శాతం తగ్గించి పూర్తిగా రానా అయన ప్యామిలీ, వారి సొంత వ్యవహారాల చుట్టూనే నడిపించారు. కాగా వెంకటేశ్ పాత్ర మాత్రం తీసికట్టుగా ఉందనడంలో అతిశయోక్తి లేదు. ఈ క్యారెక్టర్‌కు వెంకటేశ్ అవసరమే లేదు వేరే ఎవరితోనైనా చేయించొచ్చు అనే అంతగా ఆయన పాత్ర చిత్రణ ఉంది. ఓ కమెడియన్ తరహాలో, అప్పుడప్పుడు రావడం, రస్టిక్‌గా డైలాగులు చెప్పడం ఆపై మాయం కావడం, చివరలో రానాకు చివరి నిమిషంలో హైల్ప్ చేసే క్యారెక్టర్‌కే ఆయన పాత్ర పరిమితమైంది. పూర్తిగా రానా నేపథ్యంలో ఉండడం కాస్త ఊరట కలిగించే విషయం. మొత్తంగా గత సీజన్ అన్ని వర్గాల ప్రజలకు చేరువ కాకపోవడంతో ఈ సీజన్ విషయంలో అనేక జాగ్రత్తలు తీసుకున్నారు. అన్ని వెబ్ సీరిస్‌ల లాగానే ఇందులోనూ అక్రమ సంబంధ సీన్లు నడిపించారు. గత సీజన్ ఇష్టపడిన వాళ్లకు ఈ సీజన్ అంతగా నచ్చక పోయిన ఒకమారు చూసేయవచ్చు. ఫ్యామిలీస్ అక్కడక్కడ అప్రమత్తంగా ఉండాలి.






### ప్రభాస్ 'రాజాసాబ్'

# టీజర్ టైం ఫిక్స్..

## - ప్రీ టీజర్ చూశారా.!

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం ది రాజా సాబ్ . మారుతి దర్శకత్వంలో ఈ సినిమా రాబోతుండగా.. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. అయితే ఈ సినిమా నుంచి టీజర్ విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే.

జూన్ 16న టీజర్ విడుదల చేయనున్నారు మేకర్స్. తాజాగా దీనికి సంబంధించి మరో అప్‌డేట్‌ను ప్రకటించారు. ఈ సినిమా టీజర్‌ను రేపు ఉదయం 10.52 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్రబృందం తెలిపింది. ఈ సందర్భంగా ప్రీ టీజర్ ప్రోమోను పంచుకుంది.

# 'కుబేర' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కి ముఖ్య అతిథిగా జక్కన్న



శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వస్తున్న కుబేర చిత్రం నేడు గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకోబోతున్న విషయం తెలిసిందే. తమిళ నటుడు ధనుష్, టాలీవుడ్ నటుడు నాగార్జున, రష్మిక మందన్నా ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా వైడ్‌గా ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నేడు హైదరాబాద్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ జరుపుకోబోతుంది. అయితే ఈ ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథిగా దిగ్గజ దర్శకుడు ఎస్.ఎస్ రాజమౌళి రాబోతున్నారు. ఈ విషయాన్ని చిత్రబృందం తాజాగా ప్రకటించింది.పాన్ ఇండియా లెవల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర సినిమాస్ %బ్యూ%, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్లపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్



వేములవాడ, (ప్రశ్న న్యూస్) ఆధ్యాత్మికత ద్వారా మనసుకు శాంతి లభిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం వేములవాడ పట్టణంలోని ఆయన స్వగృహంలో వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు, హెూమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఆధ్యాత్మిక చింతన మనిషికి శాంతిని, స్థిరత్వాన్ని అందిస్తుంది. మానసిక ప్రశాంతతతో వ్యక్తిగతంగా అలాగే సమాజంలో సౌఖ్యం ఏర్పడుతుంది. వారాహి అమ్మవార్ల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకుంటున్నాను" అని అన్నారు.అలాగే సకాలంలో వర్షాలు కురిసి రైతులకు మంచి రోజులు రావాలని, సమస్త ప్రజానీకం సంతోషంగా జీవించాలంటూ ప్రార్థించారు.

## రేణుకా మాత గౌడ సంఘం అధ్యక్షులుగా బత్తిని ఎల్ల గౌడ్ ఎన్నిక



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ పట్టణంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో రేణుకా మాత గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.నూతన అధ్యక్షులుగా బత్తిని ఎల్ల గౌడ్ బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ఎల్ల గౌడ్ మాట్లాడుతూ, " గౌడ సంఘం అభివృద్ధి,గౌడ యువత సంప్రదాయాల పరిరక్షణే మా లక్ష్యం. సంఘం అభ్యున్నతికి సభ్యుల అశయాలను నెరవేర్చే దిశగా కార్యాచరణ రూపొందిస్తాం," అని తెలిపారు.కార్యవర్గంప్రధాన కార్యదర్శి–వెంగళ శ్రీకాంత్ గౌడ్,ఉపాధ్యక్షులు– భైరగొని మల్లేశం గౌడ్, కోశాధికారి–విక్కుర్తి అంజయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి–సార నర్సయ్య గౌడ్,గౌరవ అధ్యక్షులు–పొన్నం రవిచంద్ర గౌడ్, పులి రాజు గౌడ్, కార్యవర్గ సభ్యులు –బాలసాని తిరుపతి గౌడ్, పులి రాంగోపాల్ గౌడ్ తదితరులు ఎన్నికయ్యారు.

## సంఘం శ్రేయస్సు,యువత సంక్షేమం కోసం కృషి చేస్తా

- అంబేద్కర్ యూత్ గ్రామ నూతన అధ్యక్షులు : వంకాయల రాహుల్
- రుద్రవరం గ్రామ అంబేద్కర్ యూత్ నూతన కార్యవర్గం ఎన్నిక



వేములవాడ,(ప్రశ్న న్యూస్) వేములవాడ అర్బన్ మండలంలోని రుద్రవరం గ్రామం ఆర్ అండ్ ఆర్ కాలనీలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూత్ అసోసియేషన్‌ను స్థానిక యువత ఆదివారం నూతనంగా ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో యువజన సంఘం పదవులకు కొత్త నాయకులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.వంకాయల రాహుల్‌ను అధ్యక్షుడిగా, మాదాసు రోహిత్‌ను ఉపాధ్యక్షుడిగా, వంకాయల రంజిత్‌ను క్యాషియర్‌గా, అలాగే అనిల్‌ను ఇంచార్జిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రాహుల్ మాట్లాడుతూ – "సంఘ శ్రేయస్సు కోసం, యువత సమస్యల పరిష్కారానికి కట్టుబడి పని చేస్తాను. సమాజంలో యువతకు మార్గనిర్దేశకంగా నిలవడానికి మా యూత్ సంఘం ప్రతిజ్ఞబద్ధంగా పనిచేస్తుంది," అని పేర్కొన్నారు.

## ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



నాచారం (ప్రశ్న న్యూస్) ఉప్పల్ మండలం మల్లాపూర్ డివిజన్ లోపద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సంస్థాగత నిర్మాణం లో భాగంగా స్థానిక మల్లాపూర్ కమ్యూనిటీహాల్ లో ఉప్పల్ మండలం ఇంచార్జ్ నాగులపల్లి కేశవ్ మాదిగ కో ఇంచార్జ్ కోరేపాక అంజి మాదిగ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటం చేయడం జరిగింది.ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ 30యేండ్ల పోరాటం ,మాదిగ అమరవీరుల త్యాగం సామజిక న్యాయమైన వర్గీకరణ సాధించుకున్నామని ఇక మీదట సమాజంలో ఉన్న సమస్యలపరిష్కారం కోసం మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో మనమంతా కలిసి నడవాలని అన్నారు. అలాగే జులై 07 నా జరగబోయే 31వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమంలో కూడా అందరూ భాగమై విజయవంతం చెయ్యాలని అన్నారు.

# ప్రజలకు ఆత్మీయుడు

# అక్రమార్కులకు సింహస్వప్నం

**పాలనలో తనదైన శైలి**
**ఉత్తమంగా ప్రభుత్వ పథకాల అమలు**
**పకడ్బందీగా సేవలు అందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ**
**ఈ నెల 16 వ తేదీ నాటికి రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గా ఉద్యోగ బాధ్యతలు చేపట్టి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ పై "ప్రజా ప్రశ్న దినపత్రిక" స్పెషల్ స్టోరీ**

**(దుర్గం విజయ్ బాబు- ప్రశ్న న్యూస్ బ్యూరో)**



పేద ప్రజల విద్య, వైద్యం, ఫ సంక్షేమం, అభివృద్ధి, పై ప్రత్యేక శ్రద్ధ పెడుతూనే. ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా, పకడ్బందీగా సమర్థవంతమైన పాలనను రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలకు అందిస్తున్నారు. సహజ వనరుల అక్రమ తరలింపునకు అడ్డుకట్ట వేస్తూ అక్రమార్కుల గుండెల్లో దడ పుట్టిస్తున్నారు. అన్ని రంగాలపై దృష్టి సారిస్తూ పాలనలో తనదైన ముద్ర వేస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝూ ఏడాది పాలనపై స్పెషల్ స్టోరీ... ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ... లక్ష్యం వైపు స్పష్టత ఇస్తూ... జిల్లాలో పాలనా బాధ్యతలు స్వీకరించిన వెంటనే విద్య, వైద్య వ్యవస్థల పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు.

### ప్రభుత్వ విద్య సంస్థలను ఆకస్మిక తనిఖీ చేస్తూ... పాఠాలు బోధిస్తూ

జిల్లా కలెక్టర్ వివిధ ప్రభుత్వ విద్య సంస్థలను ఆకస్మిక తనిఖీ చేస్తూ... పాఠాలు బోధిస్తూ... విద్యాలయాల్లో వసతులు పరిశీలిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైన్సు, మ్యాథ్స్, ఇంగ్లీష్ తదితర పాఠాలు బోధిస్తూ.. వారిని వివిధ ప్రశ్నలు అడుగుతూ ప్రోత్సహిస్తున్నారు. లక్ష్యం వైపు స్పష్టతను ఇస్తూ భవిష్యత్ ప్రణాళికపై మార్గదర్శిగా నిలుస్తున్నారు.



### విద్యార్థుల విద్యా బోధన పై ప్రత్యేక శ్రద్ధ

పదో తరగతి విద్యార్థులపై శ్రద్ద పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులతో తరగతులు నిర్వహించారు. జిల్లాకు ఇటీవల రాష్ట్ర స్థాయిలో ఐదో ర్యాంకు వచ్చింది. అలాగే కస్తూర్బా గాంధీ రెసిడెన్షియల్ విద్యార్థులకు 6వ తరగతి నుంచి 12 వ తరగతుల వారికి అన్ అకాడమీ ద్వారా ఐఐటీ, జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. గత ఏడాది 3,269 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు.

### ప్రభుత్వ పాఠశాలలో అధునాతన సౌకర్యాలు కల్పిస్తూ

జిల్లాలోని 486 ప్రభుత్వ పాఠశాలల్లో ఐసీటీ ల్యాబ్ సౌకర్యం కల్పిస్తూ డిజిటల్ మాధ్యమంలో బోధనను అందిస్తున్నది. ఆయా విద్య సంస్థల్లో ఉన్నత విద్య ప్రమాణాలు కొనసాగేలా ఔట్ సోర్సింగ్ కింద టీచర్ల నియామకానికి అభ్యర్థులను కలెక్టర్ స్వయంగా ఇంటర్వ్యూ చేసి ఎంపిక చేశారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కంటి, దంత పరీక్షలు నిర్వహణ అవసరమైన వారికి దంత చికిత్స, కంటి అద్దాలు పంపిణీ చేయించారు.

### స్త్రీ, శిశు, వృద్ధుల సంక్షేమానికి పటిష్ట చర్యలు... పేద విద్యార్థులకు ఆర్థిక భరోసా

అంగన్వాడి కేంద్రాలను తనిఖీ చేస్తూ పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. కుటుంబంలో నిరాదరణకు గురైన వృద్ధులకు మండేపల్లిలోని వృద్ధాశ్రమంలో ఆశ్రయాన్ని కల్పిస్తున్నారు. అలాగే వీర్నపల్లి మండలం గోనె నాయక్ తండాకి చెందిన బదావత్ మధులత ఐఐటీ చదువు నిమిత్తం ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ శాఖ ద్వారా పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్ కింద 1 లక్షా 52 వేల రూపాయలు అందజేశారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన దోమకొండ లహరి అనే బదిర విద్యార్థినికి ఉన్నత చదువుల నిమిత్తం లక్షా 40 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు.

### ప్రభుత్వ వైద్య సేవలపై ఫోన్ లో ఆరా

జిల్లాకేంద్రం సిరిసిల్లలోని జిల్లా కేంద్ర దవాఖాన, వేములవాడ ఏరియా దవాఖాన, అన్ని మండలాల్లోని పీహెచ్సీలు, సీహెచ్సీలు క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. ఆసుపత్రి ఆవరణ, లోపల పారిశుధ్య చర్యలు, మందులు, వ్యాక్సిన్ల నిల్వలు, ఓపీ, ఇన్ పేషెంట్ వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు తెలుసుకొని వారితో కలెక్టర్ సెల్ ఫోన్లో మాట్లాడి, వైద్యం అందిస్తున్న తీరు, మందుల పంపిణీపై ఆరా తీస్తున్నారు. ఆయా దవాఖానల్లో ఉన్నత విద్య ప్రమాణాలు కొనసాగేలా కాంట్రాక్టు కింద డాక్టర్లు, వైద్య సిబ్బంది నియామకానికి అభ్యర్థులను కలెక్టర్ స్వయంగా ఇంటర్వ్యూ చేసి అర్హులను ఎంపిక చేశారు.

### ప్రత్యేక చొరవతో...ప్రభుత్వ ఆసుపత్రులలో వసతుల కల్పన

సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆసుపత్రి ఆవరణలో సీసీ రోడ్లు, సీసీ కెమెరాలు ఆయా ఎమర్జెన్సీ, ఇతర విభాగాల్లో ఆధునీకరణ పనులు పూర్తి చేసి, నూతన బోర్ వెల్ వేయించడం జరిగింది. వసతులు మెరుగు పరిచేందుకు, వైద్య ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నారు. దాదాపు రూ. 22 లక్షలతో ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట సీహెచ్ సీల్లో గదుల మరమత్తు, విద్యుత్, సీసీ కెమెరాలు, జెనరేటర్ తదితర సౌకర్యాలు కల్పించే పనులు చేయిస్తున్నారు.

### పేదల వైద్యానికి భరోసా వారి ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ

వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామానికి చెందిన చిన్నారి నయనశ్రీ క్యాన్సర్ తో బాధపడుతున్న నేపథ్యంలో 10 లక్షల రూపాయలు, అలాగే సిరిసిల్లలోని గణేష్ నగర్ కు చెందిన కోడం హరికిషన్ కొడుకు బోన్ క్యాన్సర్ తో బాధపడుతూ వైద్యానికి ఆర్థిక సహాయం కోసం సంప్రదించగా లక్షా 42 వేల రూపాయలు, ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన బొల్లె శ్రీనివాస్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వైద్యానికి రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయం చెక్కు అందజేశారు.

### సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి దోహదం

### చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పిస్తూ

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ స్థితిగతులు, ఆర్డర్లపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ వారి సమస్యలు ఎప్పటి కప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి మరియు చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పిస్తూ వారికి ఆర్థిక అభివృద్ధి కి దోహదపడుతున్నారు. వేములవాడలో యారన్ డిపో మంజూరుకు ప్రత్యేక చొరవ చూపి విజయవంతంగా కొనసాగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

### పేదలకు ఆర్థిక సహాయం, మనోధైర్యం కల్పిస్తూ ఆపదలో ఉన్నవారికి మానవత్వంతో అండగా నిలుస్తూ

సిరిసిల్లకు చెందిన నిరుపేద మహిళ గాజుల అఖిల ఉపాధి, కుటుంబ పోషణ నిమిత్తం జూకి కుట్టు మిషన్, అగ్ని ప్రమాదం సంభవించి, ఇల్లు కాలిపోయిన పలు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. అనారోగ్య, ఆర్థిక కారణాలతో ఇబ్బందులు పడుతున్న వృద్ధ దంపతులకు ఆర్థిక చేయూత. అధికారిక పర్యటనలో ప్రమాదాలకు గురైన క్షతగాత్రులను, మతిస్థిమితం కోల్పోయిన అభాగ్యులను మానవత్వంతో వారికి అవసరమైన సహాయం అందిస్తూ ఆపదలో ఉన్న వారికి మనోధైర్యంక ఇస్తూ అభాగ్యులకు అండగా నిలుస్తున్నారు.

### ప్రణాళిక ప్రకారం రాజన్న ఆలయ విస్తరణ పనులు

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణతోపాటు పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి గారిచే శంకుస్థాపన చేయించారు. వేములవాడలో రోడ్డు విస్తరణపై దృష్టి సారించి భూ నిర్వాసితులకు నష్ట పరిహారం అందచేశారు.ప్రణాళిక బద్ధంగా పనులు వేగంగా చేపట్టేలా ముందుకు వెళ్తున్నారు. ఇటీవల శివరాత్రి వేడుకలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విజయవంతంగా ముగిసేలా అధికారులతో ప్రణాళిక ప్రకారం పనులు చేయించారు.

### గోశాలలోని కోడెల సంరక్షణలో తన వంతు కృషి

తిప్పాపూర్ గోశాలలో అనారోగ్యానికి గురైన కొడెలకు పశు సంవర్ధక శాఖ వైద్య బృందంతో చికిత్స అందిస్తూ...వాటి సంరక్షణకు అన్ని చర్యలు దగ్గరుండి చేపడుతున్నారు. అర్హులైన రైతులకు మాత్రమే కోడెలు పంపిణీ చేయించేలా పకడ్బందీ ప్రణాళిక అమలు చేసి స్వయంగా పంపిణీ కార్యక్రమం లో పాల్గొని కోడెలను వ్యవసాయానికే వినియోగించాలని సూచిస్తున్నారు.

### విధుల్లో నిర్లక్ష్యం... అవినీతి అధికారులపై కఠిన చర్యలు

విధుల్లో నిర్లక్ష్యం వహించిన, అవినీతి అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటూ పరిపాలనాపరమైన సంస్కరణలు తీసుకువస్తూ ప్రభుత్వ సేవలను క్రమశిక్షణతో సకాలంలో ప్రజలకు అందిస్తున్నారు. వివిధ దినపత్రికల్లో రోజు ప్రచురితమయ్యే ప్రతికూల వార్తలపై సంబంధిత అధికారుల నుంచి రిజైన్డర్స్ క్రమం తప్పకుండా తెప్పించి ఆ సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నారు.

### ప్రభుత్వ భూములకు రక్షణ...సహజ వనరుల సంరక్షణ

ప్రభుత్వ భూములను ఆక్రమించిన వందలాది ఎకరాలను ఆక్రమణదారుల నుండి స్వాధీనం చేసుకొని, ప్రభుత్వ భూములకు రక్షణగా నిలిచారు. ఇసుక, మట్టి అక్రమ రవాణాపై ఉక్కు పాదం మోపారు. ప్రభుత్వ పథకాలు, ఇతర అవసరాలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. అక్రమ లే ఔట్లకు అడ్డుకట్ట వేశారు. సిరిసిల్లలోని వివిధ వాణిజ్య సముదాయాలకు కాలం చెల్లిన ట్రేడ్ లైసెన్సులు జరిమానాలు విధించి తిరిగి జారీ చేయిస్తున్నారు.



### దివ్యాంగులకు దివ్యమైన ఉపాధితో వారి జీవితాల్లో వెలుగులు నింపారు

దివ్యాంగులకు పెట్రోల్ పంపు నిర్వహణ బాధ్యతలు అప్పగించి 24 మందికి ఉపాధి కల్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. విజయవంతంగా కొనసాగేలా పకడ్బందీగా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. అర్హులైన దివ్యాంగులకు ఎప్పటి కప్పుడు ఉపకరణాలు తక్షణమే పంపిణీ చేయిస్తున్నారు.

### ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించి... పరిష్కారానికి ఆదేశిస్తూ

ప్రతీ సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ప్రజావాణి నిర్వహణతో పాటు, ప్రతి దినము కార్యాలయ పని దినాల్లో వివిధ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశిస్తు మరికొన్ని తక్షణమే స్వయంగా పరిష్కరిస్తున్నారు.

### ప్రజా ప్రభుత్వం కార్యక్రమాలను విజయవంతముగా నిర్వహిస్తూ

ప్రజాపాలన ప్రజావిజయోత్సవాల ఘనంగా చేపట్టారు. భూ భారతి, నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం పై అన్ని మండల కేంద్రాల్లో విజయవంతంగా అవగాహన సదస్సుల నిర్వహింపజేశారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మరియు మెడికల్ కాలేజీ లలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా క్యాంటీన్లు ప్రారంభం.. విజయవంతంగా నిర్వహణ..సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో సిరిసిల్లలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు అర్హులైన పేదవారికి పారదర్శకంగా అందజేత

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను రికార్డు స్థాయిలో పారదర్శకంగా అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే పంపిణీ చేసి, నిర్మాణాలు త్వరగా చేపట్టేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. పైరవీలు, అవినీతికి ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారు. పేదవారు తమ సొంత ఇంటి కల నెరవేరుస్తున్న కలెక్టర్ కు లబ్ధిదారులు ఇటీవల కలెక్టరేట్ కు వచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు.

### ముందస్తు ప్రణాళికతో ఇబ్బందులు దూరం

జిల్లాలో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రణాళికతో ముందస్తు చర్యలు చేయించారు. ఎక్కడా ఇబ్బందులు రాకుండా అధికార యంత్రాంగంతో పనులు చేపట్టారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా మున్సిపల్, పంచాయతీరాజ్ అధికారులతో నిత్యం పనులు చేయిస్తూ.. ఆకస్మిక తనిఖీలో పరిశీలిస్తున్నారు.

### మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో

ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశ్యంతో జిల్లాలోని ఎనిమిది స్వశక్తి సంఘాలకు ఎరువులు, పురుగు మందులు, విత్తనాల విక్రయ కేంద్రాల మంజూరు పత్రాల పంపిణీ చేశారు. జిల్లాలోని మహిళా సంఘాలకు 190 ధాన్యం కొనుగోలు కేంద్రాల కేటాయింపు, విజయవంతంగా కొనుగోళ్లు పూర్తి చేసేలా ప్రణాళిక అమలు చేశారు. దాదాపు రూ. 7 కోట్ల కమీషన్ వారికి దక్కనుంది. పలువురు క్యాంటీన్లు, ఇతర ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేయించారు. తమకు మేలు చేకూరేలా చర్యలు తీసుకుంటున్న కలెక్టర్ కు మహిళా సంఘాల ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు.రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల్లో భాగంగా స్వశక్తి మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు, రైతులకు విత్తనాలు, టీ ప్రైడ్ లబ్దిదారులకు మంజూరు పత్రాలు, మహిళలకు కుట్టుమిషన్లు అందజేశారు. ఎస్.హెచ్.జి. సభ్యులకు పెట్రోల్ బంకులు, రైస్ మిల్లుల నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు.

### మంత్రుల నుంచి ప్రశంసలు అందుకుంటూ

రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన, ఆదేశాల మేరకు ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ అందేలా ఉమ్మడి జిల్లా ఇన్ చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ గార్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ వారి ప్రశంసలు అందుకుంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రజలకు సుపరిపాలన అందిసున్నారు.

# రహదారిపై అక్రమ నిర్మాణాలు పట్టించుకోని అధికారులు

**- రెసిడెన్షియల్ అనుమతులు కమర్షియల్ నిర్మాణాలు- కాప్రా సర్కిల్లో అక్రమ నిర్మాణాల జోరు**

**- ఫిర్యాదులు చేసిన పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు - ఏసీపీ లేక అవస్థలు పడుతున్న ప్రజలు**

నాచారం (ప్రశ్న న్యూస్) కాప్రా సర్కిల్ పరిధిలో అధికారుల సిబ్బంది నిర్లక్ష్యంతో అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతుంది. ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాలు దర్శనమిస్తున్నాయి. అధికారుల సిబ్బంది అవినీతి తోడు కావడంతో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నాయి సర్కిల్ పరిధిలో ఉన్న డివిజన్లలో రాజకీయ నాయకుల పేరు చెప్పి అధికారులు సిబ్బంది అందిన కాడికి దండుకొని ప్రభుత్వ ఆదాయానికి తీవ్ర నష్టం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్ కు ఎన్ని ఫిర్యాదులు ఇచ్చిన స్పందించడం లేదని ఇంత నిర్లక్ష్యంగా ఇంత బాధ్యతారాహిత్యంగా ఉద్యోగం చేసే అధికారుల వల్ల ప్రభుత్వానికి తీవ్ర నష్టం కలుగుతుందని స్థానికులు మండిపడుతున్నారు. ఒక డిప్యూటీ కమిషనర్ అధికారి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకపోవడం వెనుక లంచాలే కారణమా.? అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను అదుపు చేయడంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పూర్తిగా విఫలం చెందారని దీనితో అక్రమ నిర్మాణదారులు అధికారుల సిబ్బంది పేరు చెప్పి వాళ్లకు లంచాలు ఇచ్చాం మాపైన చర్యలు తీసుకోరు ఎవరు ఎన్ని ఫిర్యాదులు ఇచ్చిన ఎవరు పట్టించుకోరు అంటూ బహిరంగంగా సవాల్ విసురుతున్నారు. అలాగే నాచారం డివిజన్లో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోకుండా సిబ్బంది అధికారులు అక్రమ నిర్మాణాలను కాపాడుతున్నారు. నాచారం రహదారిపై సివిఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ ముందు అనుమతులు రెండు అంతస్తులకు తీసుకొని కమర్షియల్ భవనాన్ని నిర్మించడంతోపాటు అక్రమ సెల్లార్ నిర్మాణం చేశారని స్థానికులు అనేక ఫిర్యాదులు ఇచ్చిన టౌన్




ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోకుండా నోటీసులు ఇచ్చి మౌనం వహించడం వెనక లంచాలే కారణమని స్థానికులు మండిపడుతున్నారు. కాప్రా సర్కిల్ పరిధిలో టౌన్ ప్లానింగ్ ఏసీపి సెలవుల్లో ఉండడం సెక్షన్ ఆఫీసర్ ఒక్కడే కావడంతో ఇక్కడ జరిగే అక్రమ నిర్మాణాలపై స్పందించకపోవడంతో సిబ్బంది ఆడిందే ఆట పాడిందే పాటగా సాగుతోంది. అందులో నాచారంలో విధులు నిర్వహించే చైన్ మెన్ బాలరాజు కొత్తగా రావడంతో పట్టు సాధించలేకపోవడం, గతంలో విధులు నిర్వహించిన న్యాక్ ఇంజనీర్ అశ్విని, చైన్ మెన్ రాజు ఇక్కడ



భారీగా అక్రమ నిర్మాణాలు ప్రోత్సహించారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మల్లాపూర్ నాచారం డివిజన్లో అనేక అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని దీనిపై ఇప్పటికి అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని కమర్షియల్ నిర్మాణాలు చేయడం ఇక్కడ పరిపాటిగా మారింది. అయితే స్టిల్ట్ లో వ్యాపారాలు నిర్వహిస్తుంటుంటే వాళ్లకు ట్రేడ్ లైసెన్లు ఇవ్వడం విడ్డూరంగా మారింది. అనుమతులు లేని వాటికి ట్రేడ్ లైసెన్లు ఎలా జారీ చేస్తున్నారని స్థానికులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికైనా జోనల్ కమీషనర్ స్పందించి కాప్రా సర్కిల్ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులు సిబ్బందిపై కఠినంగా వ్యవహరించాలని సానికులు కోరుతున్నారు.

# శ్రీశైలంలో మద్యం పట్టివేత




శ్రీశైలం (ప్రశ్న న్యూస్ )ద్వాదశ జ్యోతిర్లింగం శ్రీశైలం మహా క్షేత్రం అయినటువంటి నంద్యాల జిల్లా శ్రీశైలం, గ్రామము శ్రీశైల దేవస్థానం టోల్గేట్ సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా సంపంగి గణపతి వ్యక్తి మద్యం తరలిస్తుండగా పట్టుపడ్డాడు తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు ప్రస్తుతం అతను శ్రీశైలంలో వడ్డే కాలనీలో నివసిస్తున్నట్టు శ్రీశైలం వన్ టౌన్ సిఐ,జి ప్రసాద్ రావు తెలిపారు అతని వద్ద బెంగళూరు విస్కీ14 మద్యం సీసాలను మోటార్ సైకిల్ వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్టు తెలిపారు, శ్రీశైల దేవస్థానానికి భంగం కల్పించేలా ఎవరైనా ప్రవర్తిస్తే ఏటువంటి వారిపైన తీవ్రమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు

# నేడే.. జనగణన గెజిట్ విడుదల

**▶ ఈ సారి జనాభాతో పాటు కులగణన**

**▶ 16వ సారి జనాభా లెక్కలకు శ్రీకారం**



న్యూఢిల్లీప్రశ్నన్యూస్: దేశంలో ప్రతి పదేళ్లకోసారి నిర్వహించాల్సిన జనాభా లెక్కలు.. 2011లో చివరిసారిగా జరిగాయి. కరోనా కారణంగా.. 2021లో జరగాల్సిన జనాభాలెక్కలు వాయిదా పడగా.. ఎట్టకేలకు.. 2026, 2027 సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా జనాభా లెక్కలను సేకరించనున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీనికి సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ ను.. ఈ రోజు జారీ చేయనున్నారు. జనాభా లెక్కల సన్నాహాలపై సమీక్షించేందుకు కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సహా ఇతర అధికారులతో అమిత్ షా ఆదివారం భేటీ అయ్యారు. ఈ క్రమంలోనే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించారు. గెజిట్ రిలీజైన అనంతరం జనాభా లెక్కల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమవుతుంది. దేశ వ్యాప్తంగా.. జనగణన రెండు దశల్లో జరగనున్నట్టు ఇప్పటికే కేంద్ర స్పష్టం చేసింది. జమ్మూ కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లోని కొండ ప్రాంతాల్లో 2026 అక్టోబర్ 1 నుంచి ప్రారంభం కానుండగా, దేశంలోని మిగతా ప్రాంతాల్లో 2027 మార్చి నుంచి ప్రారంభం అవుతుంది. ఈ సారి జనగణనతో పాటే.. కులగణన కూడా జరగనుండటం విశేషం. ఇంటింటికీ సర్వే నిర్వహించడానికి 34 లక్షల మంది సర్వేయర్లు, సూపర్‌వైజర్లను నియమించింది. వారు క్షేత్రస్థాయి నుంచి డేటాను సేకరిస్తారు. అలాగే లక్షా 30 వేల మంది జనాభా లెక్కల అధికారులను నియమిస్తారు. ఈ ఉద్యోగులందరూ జనాభా లెక్కల కోసం క్షేత్రస్థాయి సర్వే పూర్తి చేసి డేటాను సిద్ధం చేస్తారు.

# ఆశించిన వారికి నిరాశ

**- ముందటి కాంగ్రెస్ కాదు.. సెట్ చేయడంలో సిద్ధ "హస్తు"లే**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ మంత్రి వర్గ విస్తరణ జరిగిన తర్వాత ఏదో జరుగుతుందని అందరూ అనుకున్నారు. అలా ఆశించిన వారికి నిరాశ మిగిలింది. కానీ గతం కంటే భిన్నంగా ఈసారి మంత్రివర్గ విస్తరణ జరిగి వారం రోజుల గడుస్తున్నా అసంతృప్తి పెద్దగా లేదు. దాదాపు రెండేళ్ల తర్వాత జరిగిన మంత్రి వర్గ విస్తరణ జరిగితే పెద్దయెత్తున అసంతృప్తి చెలరేగుతుందని అందరూ భావించారు. మంత్రి పదవులు కోరుకునే వారి సంఖ్య ఎక్కువగా ఉండటంతో పాటు ఇంకా ఆరు మంత్రి పదవులు భర్తీ చేయాల్సి ఉండటంతో అందరూ ఆశలు పెంచుకున్నారు. సామాజిక కోణంలోనూ, ప్రాంతాల వారీగా, జిల్లాల వారీగా తమకు అవకాశం లభిస్తుందని చాలా మంది అనుకున్నారు. విస్తరణ జరిపితే అసంతృప్తి జ్వాలలు పెరుగుతాయని అంచాన వేసారంటున్నారు. అందుకే హైకమాండ్ కూడా ఇంతకాలం వాయిదా వేసుకుంటూ వస్తుంది.

**- మూడు పోస్టులను మాత్రమే..**

అయితే హైకమాండ్ తెలివిగా మూడు పోస్టులను మాత్రమే భర్తీ చేసింది. అదీ రెండు సామాజికవర్గాలకు చెందిన వారిని మాత్రమే ఎంపిక చేసింది. ఎస్సీ మాల సామాజికవర్గం నుంచి గడ్డం వెంకటస్వామిని ఎంపిక చేసింది. ఈయనతో పాటు అదే జిల్లాకు చెందిన సీనియర్ నేత ప్రేమ్ సాగర్ రావు తనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరుకున్నప్పటికీ ఆయనకు లభించలేదు. కానీ ప్రేమ్ సాగర్ రావును తర్వాత కాంగ్రెస్ అగ్రనేతలు మాట్లాడి ఆయనకు నచ్చ చెప్పారు. తన నియోజకవర్గానికి తానే రాజు తానే మంత్రి అనిచెప్పి కార్యకర్తలకు సర్దిచెప్పారు. దీంతో తాను పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉన్నానని ప్రకటించారు. హైకమాండ్ నిర్ణయాన్ని శిరసావహిస్తామని ప్రేమ్ సాగర్ రావు ప్రకటించి ప్రత్యర్థుల ఆశలపై ఆయన నీళ్లు చల్లారు. దీంతో ఆదిలాబాద్ జిల్లాలో అసంతృప్తి లేనట్లే అనుకోవాలి.

**- మంత్రి పదవుల కోసం..**

ఇక నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్ రెడ్డి సీనియర్ నేత ఆయన తనకు కేబినెట్ లో అవకాశం కల్పించాలని కోరారు. నిజామాబాద్ జిల్లా నుంచి కేబినెట్ లో ఎవరికీ ప్రాతినిధ్యం లేకపోవడంతో తనకు అవకాశం కల్పిస్తారని భావించారు. ఇక మునుగోడు ఎమ్మెల్యేకోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. తనకు హోం మంత్రి కావాలంటూ ఆయన కామెంట్స్ కూడా గతంలో చేశారు.

జానారెడ్డి తన మంత్రి పదవికి అడ్డంపడ్డాడని కూడా గతంలో వ్యాఖ్యానించిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఈ విస్తరణ తర్వాత మంత్రి పదవి శాశ్వతం కాదని, ఎమ్మెల్యే అంతకు మించిందని అన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కొంత అసంతృప్తికి లోనైనా మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ ఛార్జి మీనాక్షి నటరాజన్ మాట్లాడటంతో ఆయనకూడా సెట్ అయ్యారు. ఇలా కాంగ్రెస్ లో అసంతృప్తి పెరుగుతుందని ఆశించిన వారికి ఆశాభంగమే మిగిలిందని చెప్పాలి. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత మిగిలిన మూడు పోస్టులను భర్తీ చేస్తామని చెప్పడంతో వెయిట్ చేయడానికే నేతలు సిద్ధమయ్యారు తప్ప గీత దాటాలని ఎవరూ అనుకోవడం లేదు.

# అవినీతి అక్రమాలకు కేర్ఆఫ్ అడ్రస్ మల్కాజిగిరి సర్కిల్

**- అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇస్తారు సెటిల్మెంట్లు చేసుకుంటారా.?**

**- కూల్చివేతలు చేయరు, చేసిన నామమాత్రంగానే , లంచాలు తీసుకున్నందుకా.?**

**- ఏసిపి, డిసి ఏకమై అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు**

**- రహదారిపై అక్రమ నిర్మాణాలు చేసిన చర్యలు లేవంటే అధికారులకు లంచాలు ముట్టాయా.?**

**- అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న వారిపై కమిషనర్ కర్ణన్ మౌనమెందుకు**

మల్కాజిగిరి (ప్రశ్న న్యూస్) జిహెచ్ఎంసిలో అవినీతి అక్రమాలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఉన్నత అధికారుల బాధ్యత రాహిత్యం కిందిస్థాయి అధికారుల, సిబ్బంది అవినీతితో జిహెచ్ఎంసి కి చెడ్డ పేరు వస్తుంది అయిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం వలన ప్రభుత్వ అధికారులు అంటే లంచాలకు మారుపేరుగా అన్నట్లుగా మారింది పరిస్థితి. ఇక జిహెచ్ఎంసి పరిధిలోని మల్కాజిగిరి సర్కిల్ నందు అవినీతి అక్రమాలు అన్ని ఇన్ని కాదు టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీ బాల శ్రీనివాస్ చర్యలు తీసుకోకపోవడం దానికి తోడు డిప్యూటీ కమిషనర్ రాజు అక్రమ నిర్మాణాలకు తోడుగా నిలవడంతో అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతుంది. అధికారులు చెప్పే నీతి సూత్రాలకు చేసే పనులకు అస్సలు పొంతన ఉండదు అవినీతి అంటే వాళ్లకు తెలియదన్నట్లుగానే మాటలు చెబుతారు మరి ఇన్ని అక్రమ నిర్మాణాలు ఎలా జరుగుతున్నాయో ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో చెప్పరు. అంత నీతిపరులు అయినప్పుడు చర్యలు తీసుకోవాలి కదా కానీ ప్రజలు పేర్కొంటున్నారు. ప్రభుత్వం లక్షల జీతాలు ఇస్తుంటే ప్రభుత్వానికి ఆదాయాన్ని పెంచకుండా నష్టాన్ని చేయడంతో పాటు అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించి ప్రభుత్వ విధివిధానాలు అమలు చేయనప్పుడు వీళ్ళు అధికారులు ఎలా అవుతారు వీళ్ళని ఉన్నత అధికారులు జిహెచ్ఎంసి కమిషనర్ ఎలా వదిలేస్తున్నారో ఆయనకే తెలియాలి. మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో రహదారులపైనే అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి అయిన పట్టించుకునే నాధుడు లేకుండా పోయాడు అధికారులకు లంచాలు ఇచ్చామా అక్రమ నిర్మాణాలు చేయించుకుంటున్నామా అన్నట్లుగా మారింది సర్కిల్ పరిధిలోని పరిస్థితి. దానికి తోడు రాజకీయ నాయకులమంటూ చిన్నాచితక గల్లి లీడర్లు మంటూ ఇక్కడ అక్రమ నిర్మాణాలకు



అండగా నిలుస్తున్నారు. తాజా మాజీ ఎమ్మెల్యేల మనుషులమంటూ ఇక్కడ అక్రమ నిర్మాణాలు బ్రోకర్లుగా మారి చేయించడం రాజకీయ నాయకులకు పరిపాటిగా మారింది. ఎమ్మెల్యే పేరు చెప్పగానే అధికారులు ఇదే ఛాన్స్ అనుకోని అక్రమ నిర్మాణాలకు ఒక రేటు మాట్లాడుకొని ఎమ్మెల్యే మనుషుల దంట అంటూ అక్రమ నిర్మాణాల వైపు కన్నితి చూడరు ఇటు ఎమ్మెల్యే అటు కార్పొరేటర్లు మరి అక్రమ నిర్మాణాలు చేయించడానికి ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడ్డారా. ?అధికారులకే తెలియాలి. ఎందుకంటే అధికారులు అవినీతి అక్రమాలను ప్రోత్సహిస్తున్నారు కాబట్టి. ఇక మల్కాజిగిరి రహదారిపై అక్రమ నిర్మాణాల పరంపర కొనసాగుతూనే ఉంది డిప్యూటీ కమిషనర్ రాజు అండదండలతో ఈ అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని దానికి ఏసీపి బాల శ్రీనివాస్ పూర్తిగా





సహకరిస్తున్నారని ఇద్దరు ఒకే వర్గానికి చెందినవారు కావడంతో అక్రమ నిర్మాణాలకు అండగా నిలుస్తూ అందిన కాడికి దండుకొని హాయిగా ప్రభుత్వ ఉద్యోగమును అడ్డం పెట్టుకొని కోట్ల అక్రమ సంపాదనకు ఎగబడ్డారని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాయిరాం థియేటర్ ముందు రెండంతస్తులకు రెసిడెన్షియల్ అనుమతులు తీసుకొని ఓ భారీ కమర్షియల్ భవనం నిర్మించారని ఈ భవనం వెనుక ఒక్కొక్క అధికారికి భారీ స్థాయిలో లంచాలు అందాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. పక్కింటి నెంబర్ 9%–%133 వెంకటేశ్వర నగర్, సాయిరాం థియేటర్ ఎదురుగా భారీ అక్రమ నిర్మాణం జరుగుతుంది అది కూడా అధికారులకు లంచాలు ఇచ్చి మరి దీనిపై నోటీసులు ఇచ్చి ఎందుకు చర్యలు తీసుకోలేదు ఎందుకు కూల్చివేతలు చేయలేదో ఎసిపి బాల శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ రాజు తెలపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## జిహెచ్ఎంసిలో విజిలెన్స్ అధికారులు డ్యూటీ చేస్తలేరా.?

జిహెచ్ఎంసిలో విజిలెన్స్ విభాగం పూర్తిగా అవినీతి మైనమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు కూడా అవినీతికి పాల్పడుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న అధికారులకు దగ్గర వస్తువులు దండా ప్రారంభించారని అందుకోసమే అధికారులకు భయం లేకుండా అక్రమ నిర్మాణాలు చేయించడమే ఉద్యోగంగా చేసు కున్నారని విజిలెన్స్ అధికారుల అవినీతికి నిర్దర్శనంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అక్రమ నిర్మాణాలు వెలిశాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. విజిలెన్స్ అధికారులు కేవలం అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించిన అధికారుల వద్ద లంచాలు తీసుకోవడానికి ఎంక్వైరీ పేరుతో వస్తున్నారని చర్యలు తీసుకుంట లేరని ప్రజలు మండిపడుతున్నారు. విజిలెన్స్ విభాగం అంటేనే అవినీతికి మారుపేరుగా మారిందన్న ఆరోపణ వినిపిస్తున్నాయి. సాక్షాత్ కార్పోరేటర్లు ఫిర్యాదు చేసిన అక్రమ నిర్మాణం కూడా విజిలెన్స్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఇంకేముంది విజిలెన్స్ ఉన్న ఒకటే లేకున్నా ఒకటే. జిహెచ్ఎంసిలో విజిలెన్స్ అధికారులకు జీతాలు దండగా అన్నట్లుగా ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిహెచ్ఎంసి కమిషనర్ చర్యలు తీసుకుంటారో లేకుంటే అవినీతిని ప్రోత్సహిస్తారో వేచి చూడాలి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588